www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -185 గురువారం 22 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

వైసీపీ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ

నామినేషన్ల గడువు పెంపునకు నిరాకరణ

ఫిర్యాదులున్న 19 చోట్ల పరిశీలించాలని ఎస్ఈసీకి ఆదేశం



న్యూ ఢిల్లీ (ప్రజావినికిడి):
ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల గడువును పొడిగించేందుకు నిరాకరించిన ధర్మాసనం, వైసీపీ ఫిర్యాదు చేసిన నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రం పరిశీలన జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) ఆదేశించింది. దీంతో పాటు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25వ తేదీకి వాయిదా వేసింది. మిగతాది 2లో...

ఫ్రెండ్లీ పోలీసింగ్ నేరస్థులకు కాదు!

పోలీస్ అమరవీరుల కార్యక్రమంలో సీఎం రేవంత్

చట్టాన్ని ఎదిరిస్తే ఎంతటి వారైనా వదలం

2027 చివరికల్లా మొత్తం పోలీసు పోస్టుల భర్తీ

ఆహార కల్తీ అతి పెద్ద సమస్యగా మారింది

సైబర్ నేరాలు, డ్రగ్స్ కట్టడికి పటిష్ఠ చర్యలు



హైదరాబాద్, అక్టోబర్ 21(ప్రజావినికిడి):
ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరస్థులకు స్వేచ్ఛ ఇచ్చినట్లు కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అనేది బాధితులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఆ పేరుతో ఇష్టానుసారం వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీసు అమరవీరులు సంస్మరణ దినోత్సవంమిగతాది 2లో...

పండుగతో భారీగా మద్యం విక్రయాలు

నాలుగు రోజుల్లోనే రూ.755 కోట్ల అమ్మకాలు

మద్యం ప్రియుల జల్సాకు గత రికార్డులు బద్దలు

ఈ నెలలో ఇప్పటికే రూ.2,055 కోట్లకు చేరిక



హైదరాబాద్, అక్టోబర్ 21(ప్రజావినికిడి):
దసరా పండుగ ఎప్పటిలాగే ప్రభుత్వానికి భారీగా కాసులు రాల్చింది. అయితే ఈసారి మాత్రం గత రికారులన్నింటినీ బద్దలు కొట్టింది. మద్యం ప్రియులు గతంలో ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో ఈసారి మద్యాన్ని కొనుగోలు చేశారు. దీంతో రాష్ట్రంలో ఈసారి మద్యం విక్రయాల్లో కొత్త రికార్డులు నమోదయ్యాయి. పండుగకు ముందు కేవలం నాలుగు పనిదినాల్లోనే ఏకంగా రూ.755.14 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. సాధారణ రోజుల కంటే పండుగ సమయంలో మద్యం విక్రయాలు పెరగడం సహజమే అయినప్పటికీ.. ఈసారి నమోదైన లెక్కలు మాత్రం గత రికార్డులన్నింటినీ మిగతాది 2లో...

రౌడీయిజం చేస్తే సహించం..

శాంతిభద్రతల్లో ఏపీ ఆదర్శంగా నిలవాలి: సీఎం చంద్రబాబు

పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

శాంతిభద్రతల పరిరక్షణలో ఏపీ దేశానికే ఆదర్శం కావాలని పిలుపు

రాజకీయ ముసుగులో నేరాలు, రౌడీయిజంపై ఉక్కుపాదం మోపాలని ఆదేశం

భద్రత ఉంటేనే పెట్టుబడులు వస్తాయి, అభివృద్ధి సాధ్యమని స్పష్టీకరణ

అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ



అమరావతి అక్టోబర్ 21: (ప్రజావినికిడి):
ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాజకీయ ముసుగులో అరాచకాలు, రౌడీయిజం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేయాలనిమిగతాది 2లో...

సీజేపీ నేతలకు ఊరట..

సీజేపీ నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాకు ఊరట

విడుదలకు ఎస్ఈఎం కోర్టు ఆదేశాలు

కస్టడీ పొడిగింపుపై హైకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

జంతర్ మంతర్ చౌరబాటు కేసులో అరెస్టు

ఎస్ఐఆర్‌పై నిరసన సందర్భంగా నినాదాలు



న్యూ ఢిల్లీ అక్టోబర్ 21(ప్రజావినికిడి):
జంతర్ మంతర్ చౌరబాటు కేసులో అరెస్టయిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాకు ఊరట లభించింది. వారిని విడుదల చేయాలని ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో మిగతాది 2లో...

కిక్కిరిసిన తిరుగు ప్రయాణం

దసరా సెలవులు ముగియడంతో పంతంగి టోల్‌ప్లాజా వద్ద భారీ రద్దీ

హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలతో కిక్కిరిసిన టోల్‌గేట్

చిట్యాల, చౌటుప్పల్ వద్ద నిర్మాణ పనులు కూడా ట్రాఫిక్‌కు కారణంగా గుర్తింపు



అమరావతిహైదరాబాద్, అక్టోబర్ 21:(ప్రజావినికిడి):
దసరా పండుగ సెలవులు ముగియడంతో నగరవాసులు తిరుగు ప్రయాణం పట్టారు. దీంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద బుధవారం మధ్యాహ్నం నుంచి వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరడంతో టోల్‌గేట్ వద్దమిగతాది 2లో...

భారత్‌తో బంధానికి నష్టం జరగదు

అమెరికా-పాక్ దోస్తీ.. భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!

భారత్‌తో బంధానికి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి రూబియో హామీ

వాణిజ్య ఒప్పందానికి అమెరికా కట్టుబడి ఉందని స్పష్టీకరణ

పాక్‌తో సంబంధాలు ఘర్షణల నివారణకు ఉపయోగపడతాయని వెల్లడి

భారత్‌ను ఆందోళనపరిచే చర్యలను పాక్ నిరుత్సాహపరిచేలా చూస్తామన్న రూబియో



సుప్రీం ఆదేశాలు మాకు బూస్ట్ ఇచ్చాయి

19 మున్సిపాలిటీల్లో గెలుస్తామన్న పెద్దిరెడ్డి

నామినేషన్ల ప్రక్రియలో తమ అభ్యర్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపణ

మిథున్ రెడ్డిపై ఐదు కేసులు పెట్టారని మండిపాటు



అమరావతి అక్టోబర్ 21:(ప్రజావినికిడి):
ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు తమ పార్టీకి ఎంతో బూస్ట్ ఇచ్చాయని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ తీర్పు నేపథ్యంలో 19 మున్సిపాలిటీలలో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసి గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ... నామినేషన్ల ప్రక్రియలో వైసీపీ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. తమ వారిని నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, గందరగోళం సృష్టించడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటిమిగతాది 2లో...

మైసూరు దసరా వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

సీఎం డీకే శివకుమార్ ఆహ్వానం...

చాముండేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రేవంత్

ప్రఖ్యాత జంబూ సవారీని ఇతర ప్రముఖులతో కలిసి వీక్షించిన సీఎం

కర్ణాటక 'నాడ హబ్బ'లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ, కేరళ ముఖ్యమంత్రులు హాజరుకావడం ఇదే ప్రథమం



హైదరాబాద్, అక్టోబర్ 21: (ప్రజావినికిడి):
కర్ణాటక రాష్ట్ర పండుగగా ప్రసిద్ధి చెందిన మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రత్యేక ఆహ్వానం మేరకు బుధవారం జరిగిన విజయదశమి వేడుకల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'జంబూ సవారీ'ని ఇతర ప్రముఖులతో కలిసి తిలకించారు మిగతాది 2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

వైసీపీ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ

(మొదటి పేజి తరువాయి)

తమ అభ్యర్థులను 19 చోట్ల నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, హింసకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని, ఈ ప్రక్రియకు విఘాతం కలుగుతుంటే రాజ్యాంగ కోర్టులు మౌనంగా ఉండలేవని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది.ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో వాటిని పరిశీలించి, నామినేషన్ల స్వీకరణకు అవకాశం కల్పించాలా వద్దా అనే దానిపై రేపటి లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది. అవసరమైతే జిల్లా కలెక్టర్ ఎదుట నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని సూచించింది.ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న తమకు నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎస్ఈసీని ఆదేశిస్తూ, తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పుడు అందరి దృష్టి రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకోబోయే నిర్ణయంపైనే కేంద్రీకృతమైంది.

మైసూరు దసరా వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజి తరువాయి)

ఉత్సవాల్లో పాల్గొనడానికి ముందు రేవంత్ రెడ్డి చాముండి కొండపై కొలువైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మైసూరు ప్యాలెస్ వెలుపల ఏర్పాటు చేసిన వేదికపై నుంచి దసరా వేడుకలను వీక్షించారు. 750 కిలోల బరువున్న బంగారు అంబారీలో చాముండేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని అలంకరించి, 'ప్రశాంత' అనే ఏనుగుపై ఊరేగించారు. ఈ కన్నుల పండువను రేవంత్ రెడ్డి ఆసక్తిగా తిలకించారు.ఈ వేడుకల్లో కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో పాటు పలువురు దేశ, విదేశీ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ప్యాలెస్ నుంచి బన్నిమంటపం వరకు సాగిన ఈ ఊరేగింపులో కర్ణాటక సంప్రదాయాలను ప్రతిబింబించే జానపద కళారూపాలు, నృత్య బృందాలు, సంగీత ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు సుమారు ఐదు లక్షల మంది ప్రజలు ప్యాలెస్ పరిసరాలకు, ఊరేగింపు మార్గం పొడవునా తరలివచ్చారు. 11 రోజుల నవరాత్రి ఉత్సవాలకు ముగింపుగా మైసూరు దసరాను 'నాడ హబ్బ'గా ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలకు తెలంగాణ, కేరళ ముఖ్యమంత్రులు హాజరుకావడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

కిక్కిరిసిన తిరుగు ప్రయాణం

(మొదటి పేజి తరువాయి)

భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.ముఖ్యంగా హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో వాహనాలు బారులు తీరాయి. కొన్ని సమయాల్లో అర కిలోమీటరు వరకు వాహనాలు నిలిచిపోయాయి. రద్దీని తగ్గించేందుకు అధికారులు హైదరాబాద్ వైపు ఉన్న 18 టోల్ బూత్‌లకు గాను 12 తెరిచి వాహనాలను పంపించారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉన్నప్పటికీ, వాహనాల తాకిడి అధికంగా ఉండటంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దీనికి తోడు, చిట్యాల, చౌటుప్పల్ వద్ద జరుగుతున్న అండర్‌పాస్, వంతెన నిర్మాణ పనులు కూడా వాహనాల రాకపోకల వేగానికి అడ్డంకిగా మారాయి.అక్టోబర్ 22 నుంచి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కానుండటంతో కుటుంబసభ్యులు, ఉద్యోగులు ఒకేసారి తిరుగు ప్రయాణం కావడం రద్దీకి ప్రధాన కారణంగా తెలుస్తోంది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు టోల్ ప్లాజా సిబ్బందితో పాటు పోలీసులు, హైవే సిబ్బంది రంగంలోకి దిగారు. అదనపు సిబ్బందిని నియమించి ఫాస్టాగ్ ప్రాసెసింగ్‌ను వేగవంతం చేశారు. కీలక కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఉండి వాహనాలను క్రమబద్ధీకరించారు. చిన్నపాటి జాప్యాలు మినహా ఎటువంటి పెద్ద ప్రమాదాలు జరగలేదని, ట్రాఫిక్ ప్రవాహం నిలకడగా కొనసాగిందని అధికారులు తెలిపారు.పండుగకు వెళ్లే సమయంలోనూ ఇదే తరహా రద్దీ కనిపించింది. అక్టోబర్ 17న 24 గంటల వ్యవధిలో ఈ టోల్‌ప్లాజా నుంచి సుమారు 52,000 వాహనాలు వెళ్లాయి. అంటే నిమిషానికి సగటున 36 వాహనాలు రహదారిని దాటాయి. రాత్రి వరకు రద్దీ కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రయాణ సమయాన్ని అంచనా వేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీజేపీ నేతలకు ఊరట..

(మొదటి పేజి తరువాయి)

పోలీసులు వారిని మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్ నుంచి ఎస్ఈఎం కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ విచారణకు ముందు సీజేపీ న్యాయ వ్యవహారాల విభాగం అధిపతి రత్నా సింగ్ కూడా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.అంతకుముందు తమ విడుదలను కోరుతూ ఎస్ఈఎం కోర్టు కస్టడీని పొడిగించడాన్ని సవాలు చేస్తూ దాస్, రంకా దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అయితే కేసులోని అంశాలపై ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదు. జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం.. ముందుగా ఎస్ఈఎం కోర్టులో జరిగే విచారణ కోసం వేచి ఉండాలని, ఆ తర్వాత అవసరమైతే తగిన న్యాయపరమైన మార్గాన్ని ఎంచుకోవాలని వారి తరఫు న్యాయవాదులకు సూచించింది. అక్కడే ఉపశమనం లభిస్తే హైకోర్టులో పిటిషన్‌పై విచారణ కొనసాగించాల్సిన అవసరం ఉండదని పేర్కొంది.సోమవారం ఎస్ఈఎం రీతూ రాజ్ ఈ ఇద్దరి జ్యుడీషియల్ కస్టడీని అక్టోబర్ 21 వరకు పొడిగించారు. వారి ప్రవర్తన వల్ల శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందని ఆ సందర్భంగా పేర్కొన్నారు. అక్టోబర్ 11న నైరుతి ఢిల్లీ జిల్లాలోని ఎస్ఈఎం ముందు సమర్పించిన బాండ్ల నిబంధనలను వారు ఉల్లంఘించారని, ప్రస్తుత కేసులోనూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని కోర్టు తన ఉత్తర్వుల్లో నమోదు చేసింది. దర్యాప్తు అధికారి సమర్పించిన వివరాలను ప్రస్తావిస్తూ.. శాంతిభద్రతలకు భంగం కలిగే ప్రమాదం ఉందన్న ఆందోళనను కూడా పరిగణనలోకి తీసుకుంది. గతంలో సమర్పించిన పూచీకత్తులు విచారణలో సరైనవి కావని తేలడంతో కొత్త పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది.
సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాతో పాటు సీజేపీ సభ్యుడు అజింక్య షిండే సహా మొత్తం 14 మందిని అక్టోబర్ 13న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రైవేటు ప్రాంగణం నుంచి జంతర్ మంతర్‌లోకి ప్రవేశించి, విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు అడ్డంకులు కలిగించారన్నది వారిపై ఉన్న ఆరోపణ. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరిగాయంటూ సీజేపీ సభ్యులు నిరసన చేపట్టి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు, వీరిని విడుదల చేస్తే చట్ట ఉల్లంఘనలు మళ్లీ జరిగే అవకాశం ఉందని, ఇతరులను కూడా ప్రేరేపించవచ్చని పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు గతంలో విడుదలను వ్యతిరేకించారు.

సుప్రీం ఆదేశాలు మాకు బూస్ట్ ఇచ్చాయి

(మొదటి పేజి తరువాయి)

చర్యలకు పాల్పడ్డారని అన్నారు. అదే సమయంలో టీడీపీ నేతలు సులభంగా నామినేషన్లు వేసేందుకు పోలీసులు సహకరించారని విమర్శించారు.
పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వైసీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదు చేసి, నోటీసులు జారీ చేస్తున్నారని పెద్దిరెడ్డి ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డిని ఐదు కేసుల్లో ఏ-1గా చేర్చారని ఆయన తెలిపారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కేసులు పెట్టినా తమ విజయాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు జోక్యంతో రాష్ట్ర ఎన్నికల సంఘం సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించి, అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పండుగతో భారీగా మద్యం విక్రయాలు

(మొదటి పేజి తరువాయి)

మించిపోయాయి. దీంతో ఎక్సైజ్‌శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. ముఖ్యంగా పండుగకు ముందురోజైన ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. దసరా ముం దస్తు విక్రయాల సరళిని పరిశీలిస్తే.. అక్టోబరు 14న రూ.102.17 కోట్ల విక్రయాలు జరిగాయి. 15న డిపోలకు సెలవు కాగా...తిరిగి 16న రూ.126.32 కోట్ల వ్యాపారం జరిగింది. ఇక 17న ఏకంగా రూ.223.25 కోట్ల మద్యం అమ్ముడైంది. 18న ఆదివారం కావడంతో ఆరోజు కూడా డిపోలకు సెలవు. అయితే 19న మాత్రం మునుపెన్నడూ లేని స్థాయిలో వ్యాపారం జరిగింది. విక్రయాల రకాల విషయానికి వస్తే.. ఎప్పటిలాగే బీర్ల హవా కొనసాగింది.
ఈ నాలుగు రోజుల వ్యవధిలోనే మొత్తం 10.44 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా.. 6.83 లక్షల కేసుల హార్డ్ లిక్కర్ విక్రయాలు నమోదయ్యాయి. ఈ గణాంకాలతో అక్టోబరు 19 నాటికి ఈ ఒక్క నెలలోనే మొత్తం మద్యం అమ్మకాలు రూ.2,055 కోట్లకు చేరుకున్నాయి. గతంలో సెప్టెంబరు నెలలో రూ.3,209 కోట్లు, ఆగస్టులో రూ.3,482 కోట్ల విక్రయాలు జరగగా, దసరా సీజన్ కావడంతో అక్టోబరు ముగిసేసరికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది దసరా సీజన్ నాలుగు రోజుల్లో నమోదైన రూ.698 కోట్లతో పోలిస్తే.. ఈసారి విక్రయాలు గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలోని 17 డిపోల ద్వారా సరఫరా అయ్యే మద్యాన్ని.. వ్యాపారపరంగా 2,620 వైన్‌షాపులు, 1,113 బార్ అండ్ రెస్టారెంట్లు, ఇవి కాకుండా పబ్బులు, క్లబ్బుల ద్వారా విక్రయిస్తుంటారు.

రౌడీయిజం చేస్తే సహించం..

(మొదటి పేజి తరువాయి)

పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నేరస్తులకు పోలీసు యూనిఫాం చూస్తే భయం కలగాలని, అదే సమయంలో బాధితులకు పూర్తి భరోసా లభించాలని ఆయన ఆకాంక్షించారు.
మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో నేడు నిర్వహించిన 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర పోలీసులకు ఆయన ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఖాకీ అంటే బాధ్యత, పోలీసు అంటే భరోసా. ప్రమాదం జరిగినా, నేరం జరిగినా ప్రజలకు మొదటగా గుర్తొచ్చేది పోలీసులే. ప్రజలు పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడానికి పోలీసులు తమ కుటుంబ సంతోషాలను త్యాగం చేస్తున్నారు" అని అన్నారు.
ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్, వీఐపీల పర్యటనలు ప్రశాంతంగా ముగియడం వెనుక పోలీసుల నిరంతర శ్రమ అభినందనీయమని కొనియాడారు. 1959లో లడఖ్‌లో చైనా సైనికులతో పోరాడుతూ పది మంది పోలీసులు ప్రాణాలర్పించారని, వారి త్యాగాలకు గుర్తుగా ఏటా ఈ దినాన్ని జరుపుకుంటున్నామని గుర్తుచేశారు.

శాంతిభద్రతలతోనే అభివృద్ధి, పెట్టుబడులు

రాష్ట్రంలో శాంతిభద్రతలు, అభివృద్ధి, ప్రజల సంతోషం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని చంద్రబాబు విశ్లేషించారు. "భద్రత, భరోసా ఉన్న చోటకే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయి. తద్వారానే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అందుకే తాను అధికారంలో ఉన్న ప్రతిసారీ శాంతిభద్రతలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తాను" అని పునరుద్ఘాటించారు.
గతంలో ఫ్యాక్షన్‌ను నియంత్రించడం, నక్సలిజాన్ని ఎదుర్కోవడం, మత ఘర్షణలను అరికట్టడంలో ఏపీ పోలీసులు చూపిన ధైర్యసాహసాలు అసాధారణమైనవని ప్రశంసించారు. ఇటీవల దేశ భద్రతకు సంబంధించిన కుట్రలను ఛేదించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆధునిక నేరాలకు టెక్నాలజీతో చెక్

మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం కూడా మారుతోందని, పోలీసు శాఖ దర్యాప్తు పద్ధతుల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. "ఒకే ఒక్క ఫోన్ కాల్, ఒక లింక్‌తో కష్టపడి సంపాదించుకున్న సొమ్మును సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్నారు. చదువుకున్నవారు సైతం మోసపోతున్నారు. ఇలాంటి నేరాలు జరగకుండా నివారించడమే ఉత్తమ పోలీసింగ్" అని పేర్కొన్నారు.
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించి దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచుకోవాలని కోరారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో 'ఈగల్' బృందం చేస్తున్న కృషిని అభినందించారు. మహిళలపై నేరాలకు పాల్పడాలంటేనే భయపడే వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఒత్తిడితో పనిచేసే పోలీసులు యోగా, ధ్యానం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. అమరుల త్యాగాలకు అసలైన నివాళి అర్పించాలంటే ప్రజలకు నిరంతర భద్రత కల్పించడమే మార్గమని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు అమర జవాన్ స్మృతిచిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం 'షహీద్ పుస్తక్ టోలీ', 'అమరులు వారు' పుస్తకాలను ఆవిష్కరించారు. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి, ఫోరెన్సిక్, విపత్తు నిర్వహణ, ఆక్టోపస్ విభాగాల ఆధునిక ఆయుధాల గురించి అడిగి తెలుసుకున్నారు.

భారత్‌తో బంధానికి నష్టం జరగదు

అమెరికా-పాక్ దోస్తీ.. భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!
భారత్‌తో బంధానికి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి రూబియో హామీ

అమెరికా, పాకిస్థాన్ మధ్య సాన్నిహిత్యం పెరుగుతున్న వేళ భారత్‌కు అగ్రరాజ్యం భరోసా ఇచ్చింది. ఇతర దేశాలతో తమ సంబంధాల వల్ల భారత్‌తో బంధానికి ఎలాంటి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం, పరస్పర సహకారానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు.
పాకిస్థాన్‌తో సంబంధాలు అవసరమేనని రూబియో అన్నారు. ఆ దేశంతో తమకున్న సంబంధాలను సానుకూలంగా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. భారత్‌ను ఆందోళనకు గురిచేసే చర్యలను పాకిస్థాన్ నిరుత్సాహపరిచేలా తమ ప్రభావాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. తద్వారా ప్రాంతీయ ఘర్షణలు తలెత్తకుండా చూడవచ్చని అభిప్రాయపడ్డారు.
భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసం చేస్తున్న ప్రయత్నాలు, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చలు తమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.
ప్రస్తుత పరిస్థితులను 1970ల నాటి అమెరికా విదేశాంగ విధానంతో పోల్చడం సరికాదని రూబియో అన్నారు. అప్పట్లో ప్రచ్ఛన్న యుద్ధం సహా అనేక పరిణామాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రపంచ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. అప్పట్లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ హయాంలో పాకిస్థాన్ సైనిక పాలకులకు వాషింగ్టన్ మద్దతుగా నిలిచింది.
రెండు రోజుల భారత పర్యటనలో ఉన్న రూబియో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపైనా స్పందించారు. నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధానికి పరిష్కారం కనుగొనడం అంత సులువు కాదని అన్నారు. సమస్యను పరిష్కరించడం తేలికై ఉంటే ఇప్పటికే యుద్ధం ముగిసిపోయేదని వ్యాఖ్యానించారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ నేరస్థులకు కాదు!



సందర్భంగా గోషా మహల్ పోలీసు స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం 'అమరులు వారే' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పోలీసులపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దని కోరారు. బాధితులకు న్యాయం చేయడం పోలీసుల ప్రాథమిక బాధ్యత అని చెప్పారు. సమస్యలు, కష్టాలతో స్టేషన్‌కు వచ్చే బాధితులను మరిన్ని ఇబ్బందులకు గురి చేయవద్దని, వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని, అదే సమయంలో నేరస్థుల పట్ల కఠినంగా పోలీసు వైఖరి ఉండాలని సీఎం స్పష్టం చేశారు.
పోలీసుల ప్రవర్తనే వారిపై ప్రజలకు నమ్మకాన్ని పెంచగలదని, పోలీసులు ఎట్టి పరిస్థితుల్లో చట్ట పరిధిని దాటి పని చేయవద్దని సూచించారు. పోలీసులకు క్రమశిక్షణే బలమని, నిజాయితీయేగౌరవమని, ప్రజల్లో కలిగిన భరోసా భావనే పోలీసులకు లభించే గొప్ప గుర్తింపు అని సీఎం అన్నారు. జవాబుదారీతనం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుళ్లకు కోటి రూపాయలు పరిహారం ఇస్తున్నామని ప్రస్తావించారు. అమరుల కుటుంబా ల పిల్లలకు వైద్య విద్యలో ప్రత్యేక సీట్లు కేటాయించామని, పోలీసు భద్రతా సంక్షేమ నిధి నుంచి రూ16 లక్షలు, పోలీసు సంక్షేమ నిధి నుంచి రూ.8 లక్షలు అందించాలని నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. పోలీసు శాఖలో 16 వేలకు పైగా ఖాళీలను గుర్తించగా, ఇప్పటికే ఐదు వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేశామని చెప్పారు. వచ్చే ఏడాది చివరిలోపు మొత్తం ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. మంచిరేవులలో 44 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీసు స్కూల్ ఏర్పాటు చేశామన్నారు. హోంగార్డుల రోజువారీ వేతనం రూ.1,000కి పెంచామని చెప్పారు. నేర పరిశోధనలో ఏఐకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పోలీసు సమాచార వ్యవస్థ మొత్తాన్ని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అనుసంధానం చేశామని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన ఆహార కల్తీని అరికట్టడానికి టీజీ సేఫ్ వ్యవస్థను ఏర్పాటు చేయడమే కాకుండా దానిని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.
ఆహార కల్తీకి పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలేది లేద న్నారు. మహిళా భద్రతా కోణంలో స్టాండ్ విత్ హర్ అనే ప్రచార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, మహిళలు, చిన్నారులకు తక్షణ రక్షణ అందించేందుకు స్పందన బృందాలు సిద్ధం చేశామని వివరించారు. చిన్నారుల కేసుల్లో సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యా యం అందించడంలో జాప్యం చేయవద్దని సీఎం పోలీసులకు సూచించారు. పోలీసు శాఖలో యువరక్తం ఇంకా రావాలని కోరారు. అంతకుముందు డీజీపీ ఆనంద్ మాట్లాడుతూ, నిజాయితీగా ప్రతి పోలీసు సేవ చేయడమే అమరులకు ఇచ్చే నివాళి అన్నారు. ప్రజల సమస్యలకు చట్టప్రకారం నిజాయితీతో పరిష్కారం చూపాలన్నారు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం 22 అక్టోబర్ 2026

కర్మన్‌ఘాట్‌లో అంగరంగ వైభవంగా
దసరా మహోత్సవాలు





కర్మన్‌ఘాట్, (ప్రజావినికిడి): క్రాంతి యువజన సంగం ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్‌లోని రామలీలా మైదానంలో దసరా మహోత్సవాలు అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తిశ్రద్ధలు, సాంప్రదాయ వైభవం నడుమ నిర్వహించిన ఈ వేడుకలకు స్థానిక ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు.దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు రావణ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజల సందడితో రామలీలా మైదానం పండుగ వాతావరణాన్ని సంతరించుకుందిఈ కార్యక్రమంలో క్రాంతి యువజన సంగం కమిటీ సభ్యులు బండారి కిషోర్ రెడ్డి,సుంకరి రమేష్ గౌడ్, చేగోని విఠల్ గౌడ్,చీర సత్యనారాయణ, గొరిగె బాబు గౌడ్, పాలెం శేఖర్ గౌడ్, చేగోని శ్రీనివాస్ గౌడ్,సూర్వి సాయి గౌడ్, రాచకొండ శ్రీనివాస్,గొరిగె సురేష్,చీర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.దసరా మహోత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన కర్మన్‌ఘాట్ ప్రజలకు, భక్తులకు, మహిళలకు, యువతకు ప్రతి ఒక్కరికీ క్రాంతి యువజన సంగం కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
ఎస్పై అపూర్వ రెడ్డి



జనగామ/చేర్యాల, అక్టోబర్ 21 (ప్రజావినికిడి): శాంతిభద్రతల పరిరక్షణలో విధులు నిర్వహిస్తూ ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని చేర్యాల ఎస్సై గూడా అపూర్వ రెడ్డి అన్నారు.బుధవారం పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై అపూర్వ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పూలను పూలతో పూజించే గొప్ప పండుగ బతుకమ్మ
ఆటపాటలతో మహిళల సంబరాలు..
ఆకట్టుకున్న వివిధ రూపాల్లోని బతుకమ్మలు





తల్లాడ/ అక్టోబర్ 21 (ప్రజావినికిడి):ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రామానుజవరం గ్రామంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామంలోని బొడ్రాయి సెంటర్ వద్ద మాజీ సర్పంచ్ శీలం కోటారెడ్డి, శివపార్వతి దంపతుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు ఆటపాటలతో, డీజే నృత్యాలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. పూలను పూలతో పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఆడపడుచులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శీలం శివపార్వతి, రామానుజవరం సర్పంచ్ కిన్నెర వెంకట కృష్ణవేణి, ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ, వార్డు సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

హనుమంతరావు ను సత్కరించిన
రేణుక ఎల్లమ్మ దేవస్థానం కమిటీ సభ్యులు







అంబర్ పేట్, (ప్రజావినికిడి):
విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం తిరుమల నగర్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ముఖ్య సలహాదారు వి.హనుమంతరావు ను వారి నివాసంలో కలిశారు.కలసిన వారిలో తిరుమల నగర్ రేణుక ఎల్లమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ రాంపల్లి జైహింద్, అధ్యక్షుడు తూర్పు రామ్ చందర్, దేవస్థానం కార్యదర్శి జి.సత్యనారాయణ, ఉప్పరాళ్ల సోమిరెడ్డి, భాగ్యపల్లి లక్ష్మీనారాయణ, రుద్రగౌని శ్రీధర్ గౌడ్, గుండెల్లి కిరణ్ కుమార్,టి. మల్లేష్ యాదవ్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ జిల్లా పట్టబద్రుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఉప్పు సత్యనారాయణ ఉన్నారు.ఈ సందర్భంగా దేవస్థానం అభివృద్ధి గురించి పెండింగ్ లో ఉన్న పలు సమస్యల గురించి హనుమంతరావు విన్నవించగా సానుకూలంగా స్పందించి తక్షణ



పరిష్కారానికి ప్రభుత్వ అధికారుల, సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం హనుమంతరావును శాలువాతో సత్కరించి దేవస్థానం కమిటీ సభ్యులు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఆదివాసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



వాజేడు,(ప్రజావినికిడి):వాజేడు మండలం,గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఆదివాసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డాక్టర్ బొదెబోయిన. సాంబశివరావు, డిఎం&ఎచ్ఓ హన్మకొండ జిల్లా హాజరైనారు, గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్ బొదెబోయిన భారత్ కుమార్, ఇర్ప బాలాజీ టీచర్ సభ అధ్యక్షులుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సభ యొక్క ముఖ్య ఉద్యేశం విద్య,ఉద్యోగం, క్రీడాలు ప్రతిభ కనబర్చిన వారికి ప్రోత్సహించి సన్మానం చేయటం గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని సుందర్యంకాలనీ గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు జజ్జరి.సుధాకర్, రజిత ల కుమార్తె కారుణ్య ఎంబిబిఎస్, మోడెం.జనార్దన్ కుమారుడు మోడెం.ఉజ్జువల్ సీట్ సాధించారు. పాయం. సాయితేజ ఐఐటి సీట్ సాధించారు. నూతన ఉద్యోగులు ఇర్ప రజినీకాంత్ ఎల్ టి,ఏటూరునాగారం కుడుముల. కిరణ్ ఎల్ టి, కన్నాయిగూడెం, ఇర్ప.అనూష, ఎఈ పిఆర్, డిపార్ట్మెంట్ బోడెబోయిన. నర్సింహా బిఎస్ఎఫ్, నూతన పదోన్నతి పొందినది జజ్జరి ఆంజనేయులు, ఎఎస్సై,కి సన్మానాలు,చేసారు.యూత్ విద్యాకోసం, ఆరోగ్యం, యూంటీ డ్రెస్ పైన సూచనలు, సలహాలు బొదెబోయిన సాంబశివరావు, ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ఇర్ప రామరావు , సుధాకర్,వార్డు సభ్యులు పద్దం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ కు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్,(ప్రజావినికిడి):దసరా పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

షాద్‌నగర్‌లో ఘనంగా నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నమాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..
కోట మైసమ్మ ఆలయంలో జమ్మి పూజ, రావణ దహనం









షాద్ నగర్,(ప్రజావినికిడి):
షాద్‌నగర్ నియోజకవర్గంలో ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరియాలని, ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని షాద్‌నగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బక్కని నరసింహులు అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని రైతు కాలనీలో ఉన్న శ్రీ కోట మైసమ్మ దేవాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆలయ ఆవరణలో జమ్మి పూజ నిర్వహించి కోట మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం అమ్మవారి ఆశీర్వాదాలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాలు మన ఆధ్యాత్మిక సంప్రదాయాలకు, సంస్కృతికి ప్రతీకలని అన్నారు. అమ్మవారి ఆరాధన ద్వారా ప్రజల్లో భక్తిభావం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించే విజయదశమి వేడుకలు ప్రతి ఒక్కరిలో ధర్మబద్ధమైన ఆలోచనలు, సత్ప్రవర్తన, ఐక్యతను పెంపొందించాలని ఆకాంక్షించారు. పండుగలు కేవలం ఆచారాలకు పరిమితం కాకుండా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఒకచోటికి చేర్చి సోదరభావాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని అన్నారు.కోట మైసమ్మ అమ్మవారి కృపతో రైతు కాలనీతో పాటు షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం భక్తులతో మమేకమైన బక్కని నరసింహులు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రావణ దహన కార్యక్రమాన్ని వీక్షించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కాజా పాషా,కె.పి. శుక్లవర్ధన్ రెడ్డి, గంధం ఆనంద్, గోపాల్ రెడ్డి, మల్లేష్ గౌడ్, వెంకటేశ్వర రెడ్డి, బాలయ్య, సురేష్ గుప్తా, విజయరాములు గౌడ్,ప్రదీప్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.శ్రీ కోట మైసమ్మ నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షులు చెరుకు శివ, ఆకుల సంపత్, కార్తీక్ గౌడ్,డి. శివకుమార్ తదితరులు బక్కని నరసింహులను ఘనంగా ఆహ్వానించారు.

మొగిలిగిద్ద,మేకగూడ గ్రామాలలో వైభవంగా దుర్గామాత నిమజ్జనోత్సవాలు

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి





షాద్ నగర్,(ప్రజావినికిడి):
నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని మొగిలిగిద్ద అదేవిదంగా మేకగూడ గ్రామాలలో దుర్గామాత నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తుల కోలాహలం, మంగళవాయిద్యాల నడుమ జరుగుతున్న వేడుకలకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అందరి జీవితాల్లో సంతోషాలు నింపాలని ఆ దుర్గమ్మను మనస్ఫూర్తిగా ప్రార్థించాను అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మొగిలిగిద్ద సర్పంచ్ బుగ్గ క్రిష్ణ,మాజీ సర్పంచ్ అన్వారీ వెంకటయ్య, మాజీ కౌన్సిలర్ కానుగు అనంతయ్య, నాయకులు కుమ్మరి వెంకటేష్, అమృత్ సాగర్ ఉమా మహేష్ సట్లపల్లి శ్రీనివాస్,అల్లాడ సురేందర్,నారా రాకేష్, ముట్పూర్ మహేష్,కుమ్మరి మధు,బండారి రాజు,మేకం రాజు,అన్వారీ రాజు,చింటు, కుమ్మరి మల్లేష్,సాయి కిరణ్,శరత్, ప్రశాంత్,కార్తీక్, సాయి ఆవుల రవి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లుకు జర్నలిస్టుల సన్మానం



తల్లాడ/ అక్టోబర్ 21 (ప్రజావినికిడి):
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ విభాగం వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన నారపోగు వెంకటేశ్వర్లును తల్లాడ జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని స్వగ్రామానికి వచ్చిన ఆయనను బుధవారం జర్నలిస్టులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించి, శాలువాతో సత్కరించారు.అనంతరం పలు అంశాలపై ఆయనతో జర్నలిస్టులు చర్చించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు దేవబత్తిని సీతారాములు, గొడ్ల బాబురావు, కాంపాటి రవి, గొడ్ల నరసింహారావు, గొల్లమండల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.ం

పాదయాత్ర జ్ఞాపకాలతో అయిజలో ఘనంగా దసరా వేడుకలు..

2012 నాటి 'వస్తున్నా మీకోసం' పాదయాత్ర జ్ఞాపకాలు.. అయిజలో దసరా వేడుకలు జరిపిన పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని..

చంద్రబాబు కుటుంబం ఆయురారోగ్యాలతో ఉండాలని బక్కని నరసింహులు ప్రత్యేక పూజలు..







అలంపూర్,(ప్రజావినికిడి):
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని అయిజ మండల కేంద్రంలో విజయదశమి (దసరా)పర్వదిన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి.పండుగను పురస్కరించుకొని స్థానిక ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్వయంభూ కట్టకింది తిమ్మప్ప స్వామి దేవాలయంలో తెలుగుదేశం పార్టీ (టిడిపి) పొలిట్ బ్యూరో సభ్యులు,షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు అర్చనలు

విజయదశమి ఉదయం తిమ్మప్ప స్వామి దేవాలయానికి చేరుకున్న బక్కని నరసింహులు టిడిపి నాయకులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి శాస్త్రోక్తంగా ముక్కోటి అభిషేకాలు, విశేష అర్చనలు,ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.
దేశం,ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నారు. ఆలయ దర్శనం అనంతరం దేవాలయ ఆవరణలో కొలువై ఉన్న జమ్మి చెట్టు (అపరాజితాదేవి) వద్ద వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సాంప్రదాయబద్ధంగా షమీ పూజను నిర్వహించారు.

2012 నాటి చంద్రబాబు పాదయాత్ర జ్ఞాపకాలు

ఈ సందర్భంగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు మాట్లాడుతూ,
అయిజ గ్రామానికి,నారా చంద్రబాబు నాయుడు కుటుంబానికి ఉన్న ప్రత్యేకమైన అనుబంధాన్ని, సెంటిమెంట్‌ను గుర్తుచేసుకున్నారు.గతంలో 2012 అక్టోబర్ 24న చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపట్టిన చారిత్రాత్మక 'వస్తున్నా మీకోసం' పాదయాత్రలో భాగంగా దసరా పండుగ రోజున అయిజ మండల కేంద్రానికి చేరుకున్నారని తెలిపారు. ఆనాడు విజయదశమి పండుగను చంద్రబాబు నాయుడు తన కుటుంబ సమేతంగా ఇదే అయిజ గ్రామంలో,ప్రజల మధ్య అత్యంత వైభవంగా జరుపుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.నాటి నుండి ఈనాటి వరకు అదే ఆనవాయితీని కొనసాగిస్తూ.. ప్రతి సంవత్సరం దసరా పర్వదినాన అయిజ కట్టకింది తిమ్మప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, జమ్మి చెట్టుకు షమీ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

సీఎం చంద్రబాబు కుటుంబం చల్లగా ఉండాలని ప్రార్థన

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో చల్లగా ఉండాలని,ప్రజా సంక్షేమ పాలన మరింత ముందుకు సాగాలని స్వామివారిని మనసారా ప్రార్థించినట్లు బక్కని నరసింహులు పేర్కొన్నారు.ఈ పావన వేళ ఉమ్మడి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు,అలాగే ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలుగు వారందరికీ విజయదశమి పండుగ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ వెంకటయ్య గౌడ్‌కు ఘన సన్మానం



జనగామ/చేర్యాల, అక్టోబర్ 21(ప్రజావినికిడి):
చేర్యాల మండల కేంద్రానికి చెందిన పచ్చిమట్ల వెంకటయ్య గౌడ్ ఇటీవల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం చేర్యాల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద పట్టణ ప్రముఖులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొమరవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, పద్మశాలి సంఘం నాయకుడు దూలం వెంకటేశం, మాజీ మార్కెట్ డైరెక్టర్ తడక లింగమూర్తి, గోని లక్ష్మీనారాయణ, తౌట రవీందర్, ఇప్పకాయల సంజీవులు తదితరులు పాల్గొని వెంకటయ్య గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా దుర్గామాత ఉత్సవాల ముగింపు

విగ్రహ దాత అల్లేపు రాజు, ఆలయ చైర్మన్ మద్దె రాములు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆశీస్సులు

ఎల్కతుర్తి/ అక్టోబర్ 21(ప్రజావినికిడి):



ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలోని శివాలయంలో తొమ్మిది రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహించిన దుర్గామాత ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మంకని పద్మ చేరాలు అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.ఆలయ చైర్మన్ మద్దె రాములు, ఆలయ డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారి విగ్రహ దాత అల్లేపు రాజు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అమ్మవారి కానుకల వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారి చీర, వస్త్రాల వేలంపాటలో ఠాకూరి రోహిత్ సింగ్ రూ.1,900కు చీరను దక్కించుకున్నారు. అమ్మవారి చీరను సొంతం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు భక్తులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మద్దె రాములు, విగ్రహ దాత అల్లేపు రాజు మాట్లాడుతూ అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులు గ్రామంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

గ్రామాభివృద్ధికి రచ్చబండపై కూర్చోవడానికైనా సిద్ధం

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పంతాలు, కక్షసాధింపులు పక్కనపెట్టి..

ఊరి బాగు కోసం చేతులు కలపండి

గ్రామసభ నిర్వహిస్తే నేనూ హాజరై నిధులు కేటాయిస్తా

నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో గ్రామస్థులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే పిలుపు





షాద్ నగర్,(ప్రజావినికిడి):
రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి. గ్రామాభివృద్ధి విషయానికి వచ్చేసరికి అంతా ఒక్కటి కావాలి..రాజకీయాలలో కొందరు దుర్మార్గులు ఉన్నారు. మరికొందరు సన్మార్గులు ఉన్నారని అయితే గ్రామస్తులు రాజకీయ రాజకీయాలు పట్టించుకోకుండా గ్రామ అభివృద్ధి కోసం ముందుకు రావాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే,రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అప్పారెడ్డి గూడ, వీర్లపల్లి, వెంకమ్మగూడ చేగూర్ గ్రామంలో నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయా గ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరిగిన ముగింపు ఉత్సవాలలో ఎమ్మెల్యే శంకర్ ప్రసంగించారు. గ్రామం బాగు కోసం అవసరమైతే ఏ హోదానైనా పక్కనపెట్టి,నడి రచ్చబండపై సాధారణ గ్రామస్థుడిగా కూర్చొని సమస్యలు పరిష్కరించడానికి సిద్ధమని ఆయన తేల్చిచెప్పారు. దేవీ నవరాత్రోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, గ్రామస్థులు, నాయకులను ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. రాజకీయాల్లో దుర్మార్గులు ఉంటారని అలాంటి వారిని పట్టించుకోవద్దని ఎమ్మెల్యే సూచించారు. ఊరు మనదని ఊరు బాగు మనదని దుర్మార్గులను పట్టించుకోవద్దని అన్నారు.అదే సమయంలో రాజకీయాల్లో సన్మార్గులు కూడా ఉంటారని సెలవిచ్చారు. పుట్టుకతోనే ఎవరు గొప్పోళ్లు కాలేరని,ఈరోజు పదవులు అనుభవిస్తున్న వారు ఆవగింజంత అదృష్టం ఉంటేనే అవి వారికి దక్కుతాయని అలాంటి సమయంలో వచ్చిన గొప్ప అవకాశాన్ని ప్రజల బాగుకోసం ఉపయోగించాలని దుర్మార్గంగా వ్యవహరించకూడదని అన్నారు.

మంచిని మంచి అనండి.. చెడు ఉంటే నిలబీయండి

ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామం అనేది ఏ ఒక్కరి సొత్తు కాదని,అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మీరు ఎవరినైనా గౌరవించండి, నాకేమీ అభ్యంతరం లేదు.కానీ ఊరిలో మంచి జరిగితే మంచి అనండి..చెడు ఉంటే నిర్భయంగా ఎత్తిచూపండి. అంతేకానీ సంకుచిత మనస్తత్వాలతో, రాజకీయ విద్వేషాలతో ఊరిని అధోగతి పాలు చేయవద్దు అని హితవు పలికారు. నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసినప్పుడే ప్రభుత్వ నిధులు సద్వినియోగమై గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తాయని పేర్కొన్నారు.

నేనూ ఈ గ్రామ బిడ్డనే ,ఓటర్‌నే

తాను ఎమ్మెల్యేగా కంటే ముందు ఈ ఊరి బిడ్డనని,ఇక్కడి ఓటర్‌నని శంకర్ గుర్తుచేశారు. "నేను మీ కుటుంబ సభ్యుడిని,మీ సోదరుడిని. గ్రామంలో చిన్నపాటి పంతాలకు, కక్షలకు పోయే మనస్తత్వం నాది కాదు.ద్వేష రాజకీయాలకు నేను ఎప్పుడూ దూరం. గ్రామానికి సంబంధించి ఏవైనా సమస్యలు, విభేదాలు ఉంటే వెంటనే గ్రామసభ ఏర్పాటు చేయండి. సర్పంచ్ గ్రామసభ పెట్టి నన్ను పిలిస్తే తప్పకుండా వచ్చి కూర్చుంటా. ఊరికి ఏమేం కావాలో ముఖాముఖి చర్చించుకుందాం అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేస్తా" అని స్పష్టమైన హామీ ఇచ్చారు.

అభివృద్ధి జరిగితే అది పాలకవర్గానికే గౌరవం

తాము వేయించిన సీసీ రోడ్ల వల్లే నేడు మహిళలంతా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఒకచోట కూర్చోగలిగారని గుర్తుచేసిన ఎమ్మెల్యే, రాబోయే రోజుల్లో గ్రామానికి ప్రత్యేకంగా ఒక సామాజిక భవనాన్ని కూడా మంజూరు చేయిస్తామని ప్రకటించారు. పనులు పూర్తయి గ్రామం బాగుపడితే ఆ కీర్తి,గౌరవం గ్రామ పంచాయతీ పాలకవర్గానికే దక్కుతుందని ఆయన పెద్ద మనసు చాటుకున్నారు. వ్యక్తిగత ప్రతిష్టల కన్నా ప్రజా ప్రయోజనాలే ముఖ్యమనే ఎమ్మెల్యే ధోరణికి అక్కడున్న ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించిన గ్రామ ప్రజలందరికీ, భవానీ దీక్షాపరులకు, కమిటీ సభ్యులకు, మాతృమూర్తులకు జగన్మాత ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, భవానీ భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు సర్పంచులు, సింగల్ బెండు చైర్మన్లు,వైస్ చైర్మన్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, చెంది తిరుపతి రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు కుమార్ గౌడ్, ఫరూక్‌నగర్ మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, కొందుర్గు మండల ప్రెసిడెంట్ పురుషోత్తం రెడ్డి, మాజీ మండల ప్రెసిడెంట్, సింగల్ విండో చైర్మన్ పసుల బుచ్చయ్య, ఫరూక్‌నగర్ మండల సింగల్ విండో చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజ్ గౌడ్,నందిగామ మండల సింగల్ విండో చైర్మన్ చంద్రపాల్ రెడ్డి, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, వెంకమ్మగూడ సర్పంచ్ అశోక్, అప్ప రెడ్డి గూడా సర్పంచ్ మల్లేష్, వీర్లపల్లి అన్వర్, శేఖర్ గౌడ్, నవాజ్ రెడ్డి, సీతారాం,బండి మాణిక్యం,సత్య నారాయణ,కేకే కృష్ణ,జాంగారి రవి,లింగారెడ్డి గూడా అశోక్, దేవగిరి నవీన్, ముబారక్ అలీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

యాదాద్రి ఐదో యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం



హైదరాబాద్: రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టీజీజెన్కో) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ఐదో యూనిట్‌ను మంగళవారం గ్రిడ్‌కు అనుసంధానించారు. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మించిన ఈ విద్యుత్ కేంద్రం మొత్తం సామర్థ్యం 4,000 మెగావాట్లు. ఒక్కొక్కటి 800 మెగావాట్ల సామర్థ్యంతో ఐదు యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మొదటి నాలుగు యూనిట్లు ప్రారంభమై వాణిజ్య కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఐదో యూనిట్ సింక్రనైజేషన్ పూర్తికావడంతో ప్రాజెక్టు మరో కీలక మైలురాయిని చేరుకుంది. తదుపరి వాణిజ్య కార్యకలాపాల ప్రారంభానికి (సీఓడీ) అవసరమైన ప్రక్రియల కోసం యూనిట్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ సందర్భంగా సీఎండీ ఎస్. హరీశ్ యూనిట్ సింక్రనైజేషన్‌లో కృషి చేసిన బీహెచ్ఈఎల్, టీజీజెన్కో బృందాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీజీజెన్కో డైరెక్టర్ వై. రాజశేఖర్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ పి.వి. శ్రీనివాస్, యాదాద్రి ప్రాజెక్టు స్టేజ్-2 చీఫ్ ఇంజినీర్ జె. సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఈసిల లేఖాస్త్రం



న్యూఢిల్లీ: వివాదాస్పద విధుల కేటాయింపు ఉత్తర్వులపై జూలై 29న భారత ఎన్నికల కమిషన్‌లో ని ముగ్గురు కమిషనర్లలో ఇద్దరు అసాధారణంగా స్పందించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు కాకుండా నేరుగా క్యాబినెట్ కార్యదర్శికి లేఖలు రాశారు.ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో), జాతీయ భద్రతా మండ లి సచివాలయం, క్యాబినెట్ సచివాలయం ఉన్న సేవా తీర్థ్ సముదాయంలో ఆ లేఖలపై ఏం జరిగిందనేది తాజాగా వెల్లడైంది. సమాచార హక్కు చ ట్టం (ఆర్టీఐ) కింద 'ఇండియా టుడే'కు అందిన స మాధానంలో ఈ వివరాలు వెలుగులోకి వచ్చా యి.సెప్టెంబర్ 24న దాఖలైన ఆర్టీఐ దరఖాస్తుకు అక్టోబర్ 19న ఇచ్చిన సమాధానంలో.. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి రాసిన లేఖలు క్యాబినెట్ సచివాలయానికి చేరినట్లు ధ్రువీకరించారు.ఈ రెండు లేఖలపై జూలై 29 తేదీ ఉంది.ఈ రెండు లేఖలను జూలై 30న న మోదు చేశారు. ఆగస్టు 5 నాటికి క్యాబినెట్ కార్యదర్శి వాటిని సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ) అధికారులకు, సీఈసీ కార్యాలయానికి పంపించా రు. అయితే, లేఖల్లోని విషయాలను వెల్లడించలే దు. ఎన్నికల కమిషనర్ల 10 పేజీల లేఖలు, ప్రత్యుత్తరాలకు సంబంధించిన 2 పేజీలు, ఫైల్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన మరో 2 పేజీలు.. మొ త్తం 14 పేజీలను సచివాలయం అందుబాటులోకి తీసుకురాలేదు. వాటి కోసం చెల్లించాల్సిన రూ. 28 రుసుము ఇంకా చెల్లించకపోవడంతో పత్రాలను నిలిపివేసింది.జూలై 28న జారీ చేసిన విధుల కేటాయింపు ఉత్తర్వులే ఈ వివాదానికి కారణం. ఆ ఉత్తర్వులపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసి, అవి నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ క్యాబినెట్ కార్యదర్శికి లేఖలు రాసినట్లు ఒక వార్తాపత్రిక తెలిపింది. ఆ తర్వాత కొత్త విధుల కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేశారు. ఎన్నికల ఓటరు జాబితాల నిర్వహణకు సంబంధించిన ఐటీ వ్యవస్థ పర్యవేక్షణలో ఒక కీలక స్థానిని ఈ మార్పులు తొలగించినట్లయ్యాయని, తమకు తెలియకుండానే మార్పులు చేశారని కమిషనర్లు పేర్కొన్నట్లు ఆ పత్రిక తెలిపింది. ఈ చర్యను సాధారణ విధానానికి భిన్నమైన కీలక మార్పుగా అభివర్ణించింది. మరోవైపు, ఈ లేఖలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు సంబంధించినవి కాకుండా, సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌కు సంబంధించినవని విషయం తెలిసిన వ్యక్తిని ఉటంకిస్తూ మరో వార్తాపత్రిక కథనం ప్రచురించింది.ఈ వివాదంపై సెప్టెంబర్ 26న ఎన్నికల కమిషన్ ప్రకటన విడుదల చేసింది. 'క్యాబినెట్ కార్యదర్శికి రాసిన లేఖ కమిషన్‌కు సంబంధించిన విధానపరమైన అంశం గురించి కానీ, ఐటీ విభాగం గురించి కానీ కాదు. ఎన్నికల కమిషన్‌లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఒక అధికారి పనితీరుకు సంబంధించినది. సంబంధిత అధికారి జారీ చేసిన విధుల పునఃకేటాయింపు ఉత్తర్వులు ఇద్దరు కమిషనర్ల ఆదేశాల తర్వాత వాస్తవానికి అమలు కాలేదు. డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌కు ఉన్న ఐటీ విభాగ పర్యవేక్షణ బాధ్యతలను తొలగించలేదు' అని పేర్కొంది.'ఇండియా టుడే' అడిగిన ప్రశ్నలకు వచ్చిన ఆర్టీఐ సమాధానం.. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు లేఖల్లో ఏం రాశారు, ఏ అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారనే విషయాలను వెల్లడించలేదు. అయితే, లేఖలు ఉన్నాయని, అవి ఎప్పుడు చేరాయని, క్యాబినెట్ కార్యదర్శి వాటిని ఎక్కడికి పంపించారనే విషయాలను ధ్రువీకరించింది. లీకైన సమాచారం, పత్రికా ప్రకటనల ఆధారంగా సాగుతున్న ఈ వివాదంలో ఇది తొలి అధికారిక పత్రంగా 'ఇండియా టుడే' పేర్కొంది.రూ.28 రుసుము చెల్లించి పత్రాలను పొందుతామని 'ఇండియా టుడే' తెలిపింది. పత్రాలు అందిన తర్వాత ఎన్నికల కమిషనర్లు ఏమి రాశారు, క్యాబినెట్ కార్యదర్శి ఎలా స్పందించారనే వివరాలతో కథనాన్ని నవీకరిస్తామని పేర్కొంది. ఆర్టీఐ కింద కోరిన పత్రాల కోసం రూ.28ను డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్ చెక్, ఇండియన్ పోస్టల్ ఆర్డర్ లేదా సరైన రసీదు పొందుతూ నగదు రూపంలో చెల్లించాలి. ప్రస్తుతం డిజిటల్ చెల్లింపు సదుపాయం అందుబాటులో లేదుద

బతుకమ్మ పండుగ ముగిసింది...
మహిళలకు చీరల జాడేది.!

పంపిణీపై ప్రభుత్వం ఎప్పుడు స్పష్టత ఇస్తుంది? అర్హులైన మహిళల్లో కొనసాగుతున్న ఎదురుచూపులు

అక్టోబర్ 21: (ప్రజావినికిడి):
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ముగిసింది..మహిళలకు చీరల పంపిణీపై స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.బతుకమ్మ పండుగ అనగానే తెలంగాణ ఆడపడుచులకు ప్రత్యేకమైన గుర్తింపు, ఆనందం గుర్తుకొస్తాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి మహిళలు సంబరాలు చేసుకుంటారు. అలాంటి పండుగ వేళ ప్రభుత్వం మహిళలకు చీరలు అందిస్తే వారి ఆనందం రెట్టింపయ్యేది.అయితే పండుగ ముగిసిన తర్వాత కూడా చీరల పంపిణీపై స్పష్టత లేకపోవడంతో అర్హులైన మహిళలు ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది.పండుగ సమయంలో ఇవ్వాల్సిన చీరలు..పండుగ తర్వాత ఇస్తే ప్రయోజనం ఏమిటి? అనే ప్రశ్నలు ప్రజల్లో



వ్యక్తమవుతున్నాయి.మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం, బతుకమ్మ చీరల పంపిణీ విషయంలో స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని పలువురు మహిళలు కోరుతున్నారు.అర్హులైన మహిళలకు చీరలు ఎప్పటిలోగా అందజేస్తారు ఆవివరాలను ప్రజలకు తెలియజేయాలని మహిళలు కోరుతున్నారు.పండుగకు ముందే చీరలు అందిస్తే మహిళలు వాటిని ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే అవకాశం ఉండేది. పండుగ ముగిసిన తర్వాత పంపిణీ చేపడితే ఆ పండుగకు సంబంధించిన ప్రత్యేక ఆనందాన్ని మహిళలు కోల్పోయినట్లవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.బతుకమ్మ సంబరాలు ముగిశాయి.. పూల పండుగకు తెరపడింది.. కానీ మహిళలకు చీరలపై ఎదురుచూపులు మాత్రం కొనసాగుతున్నాయి.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చీరల పంపిణీపై అధికారిక ప్రకటన చేయాలని, అర్హులైన మహిళలకు ఎప్పటిలోగా అందజేస్తారో స్పష్టంగా తెలియజేయాలని ప్రజలు మహిళలు కోరుతున్నారు

ఏపీలో 19 మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియకు బ్రేక్

నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారంటూ వైసీపీ పిటిషన్

అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను నిలిపివేయాలని సుప్రీం ఉత్తర్వులు

సుప్రీంకోర్టు సూచనలతో ఎస్ఈసీ కీలక నిర్ణయం

అక్టోబర్ 21: (ప్రజావినికిడి):
ఆంధ్రప్రదేశ్‌లో 19 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ) తాత్కాలికంగా నిలిపివేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాసేపటి క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ మున్సిపాలిటీల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ నిలిచిపోయాయి.



రాష్ట్రంలో అధికార పక్షం వేధింపుల కారణంగా పలు ప్రాంతాల్లో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, వారిని అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని, గడువు పొడిగించి తగిన రక్షణ కల్పించాలని పిటిషన్‌లో కోరింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగడం రాజ్యాంగ మౌలిక సూత్రమని స్పష్టం చేసింది.
ఈ నేపథ్యంలో, వైసీపీ చేసిన ఫిర్యాదులను, సమర్పించిన ఆధారాలను కేసుల వారీగా పరిశీలించి అక్టోబర్ 22వ తేదీలోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటివరకు అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించవద్దని స్పష్టం చేసింది. అక్టోబర్ 25న తుది జాబితాను విడుదల చేయాలని సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని ఎస్ఈసీ తన ప్రకటనలో తెలియజేసింది.

నిత్యవసరాల ధరలకు కళ్లెం వేయండి

: అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

నిత్యవసరాల ధరల పెరుగుదలను నియంత్రించాలని సీఎం ఆదేశం

ఎల్ నినో ప్రభావం ప్రజలపై పడకుండా చర్యలు తీసుకోవాలని సూచన

పీఎం సూర్యఘర్ కనెక్షన్ల ఏర్పాటును వేగవంతం చేయాలన్న చంద్రబాబు

ఇసుక, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం

అక్టోబర్ 21: (ప్రజావినికిడి):
రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి, సామాన్య ప్రజలపై భారం పడకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ధరలు పెరుగుతున్నాయని, దాని ప్రభావం రాష్ట్రంపై పడకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బియ్యం, కందిపప్పు, ఉల్లి, వంటనూనె, పంచదార వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అమ్మకాలపై ఆయన ఆరా



తీశారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికారులు వివరించగా.. దీపావళి, సంక్రాంతి పండుగల సమయంలో కూడా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. మార్కెట్‌లో ఉల్లిపాయల సరఫరాను మరింత పెంచి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.
రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్నామని, దీన్ని మరింత మెరుగుపరచాలన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో తొమ్మిది లక్షల కనెక్షన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, దీని కోసం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.ఇసుక సరఫరాలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం సూచించారు. పాలనలో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని చంద్రబాబు అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఈయూ గెలుపు



హైదరాబాద్, అక్టోబరు 21 తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) గెలిచిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రహస్య బ్యాలెట్ ద్వారా ఈనెల 9న ఈ ఎన్నికలు నిర్వహించగా.. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలను 14, 15వ తేదీల్లో నిర్వహించారు. మొత్తం 34,904 మంది ఓటర్లుండగా.. 34,421 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బస్సు గుర్తుతో బరిలోకి దిగిన ఈయూ 18,276 ఓట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్‌కు 13,113 ఓట్లు, తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్‌కు 1,315 ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓట్లు సాధించిన ఈయూ కార్మికుల ప్రతినిధి యూనియన్‌గా అర్హత సాధించిందని.. ఈ గుర్తింపు రెండేళ్ల పాటు అమల్లో ఉంటుందని కమిషనర్ పేర్కొన్నారు

తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు

: మహేశ్ గౌడ్

బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్

రేవంత్ రెడ్డి పాలన 2039 వరకు కొనసాగుతుందని విశ్వాసం

కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య

అక్టోబర్ 21(ప్రజావినికిడి):
తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని



మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు.బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

శరవేగంగా బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే..

ఏపీలో మారనున్న రవాణా ముఖచిత్రం

బెంగళూరు-విజయవాడ మధ్య భారీగా తగ్గనున్న ప్రయాణ సమయం

11-12 గంటల ప్రయాణం ఇకపై 6-7 గంటలకు పరిమితం

భారతమాల-2 కింద రూ.19,200 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం

2027 నాటికి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు కీలక జిల్లాల మీదుగా వెళ్లనున్న కొత్త రహదారి



అక్టోబర్ 21: (ప్రజావినికిడి):

బెంగళూరు, విజయవాడ నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని సగానికి పైగా తగ్గించే బృహత్తర ప్రాజెక్ట్ నిర్మాణం శరవేగంగా ముందుకు సాగుతోంది. 'భారతమాల పరియోజన' ఫేజ్-2లో భాగంగా నిర్మిస్తున్న ఈ ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి వస్తే, ప్రస్తుతం 11-12 గంటలు పట్టే ప్రయాణం కేవలం 6-7 గంటలకు పరిమితం కానుంది. ఇటీవల ఈ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్‌ను 2027 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సుమారు రూ.19,200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ యాక్సెస్-కంట్రోల్డ్ హైవే, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషించనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఏపీ-కర్ణాటక సరిహద్దులోని కోడికొండ నుంచి ప్రకాశం జిల్లా అద్దంకి సమీపంలోని ముప్పవరం వరకు సుమారు 343 కిలోమీటర్ల మేర పూర్తిగా కొత్త రహదారిని నిర్మిస్తున్నారు. ఈ మార్గం ప్రధానంగా ఏపీలోని కర్నూలు, కడప, ప్రకాశం, గుంటూరు జిల్లాల మీదుగా వెళుతుంది. దీనివల్ల రద్దీగా ఉండే పట్టణాలను తప్పించుకుని వేగంగా ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. ఒక్క ప్రకాశం జిల్లాలోనే దాదాపు 110 కిలోమీటర్ల మేర చంద్రశేఖరపురం, కనిగిరి, వెలిగండ్ల, మర్రిపూడి, చీమకుర్తి, తాళ్లూరు, అద్దంకి, కొండేపి, పంగులూరు మండలాల మీదుగా ఈ హైవే నిర్మాణం జరుగుతోంది.ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ పనులను 14 ప్యాకేజీలుగా విభజించి మేఘా ఇంజినీరింగ్, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, దిలీప్ బిల్డ్‌కాన్ వంటి సంస్థలకు అప్పగించారు. మట్టి పనులు, కల్వర్టులు, వంతెనల నిర్మాణంతో పాటు తారు రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఎక్స్‌ప్రెస్‌వే పూర్తయితే వ్యవసాయ ఉత్పత్తులు, ఖనిజాలు, పారిశ్రామిక వస్తువులను బెంగళూరు, విజయవాడ మార్కెట్లకు, తూర్పు తీరంలోని ఓడరేవులకు వేగంగా తరలించేందుకు మార్గం సుగమం అవుతుంది.

ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను అనుసంధానించేందుకు కర్ణాటకలోని దేవనహళ్లి నుంచి ఏపీ సరిహద్దులోని కోడికొండ వరకు ఉన్న జాతీయ రహదారి-44ను 10 వరుసలుగా (ఆరు వరుసల ప్రధాన క్యారేజ్‌వే) విస్తరించేందుకు ఎన్‌హెచ్ఏఐ డీపీఆర్ సిద్ధం చేస్తోంది. కోడికొండ వద్ద కొత్త ఎక్స్‌ప్రెస్‌వేను కలిపేందుకు భారీ క్లోవర్‌లీఫ్ ఇంటర్‌ఛేంజ్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య వాణిజ్య, రవాణా రంగాల్లో కొత్త శకం మొదలవుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

మీరు జెన్ జీ కాదు

: సీజేపీ నేతలతో ఢిల్లీ హైకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు



అక్టోబర్ 21: (ప్రజావినికిడి):

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా తమ జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపును సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం వెనక్కి తీసుకున్నారు. ప్రత్యామ్నాయ న్యాయపరమైన మార్గాలు అందుబాటులో ఉండగా నేరుగా హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని ధర్మాసనం ప్రశ్నించడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన కేసులో అరెస్టయిన సౌరవ్ దాస్ (27), అశుతోష్ రంకా (32) జ్యుడీషియల్ కస్టడీని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అక్టోబర్ 19న మరో రెండు రోజులు పొడిగించారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు.

ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిటిషనర్ల వయసు గురించి న్యాయవాది చెప్పగా, 'అయితే మీరు జెన్ జీ కాదు' అని అన్నారు. రివిజన్ పిటిషన్ వేసే అవకాశం ఉన్నప్పుడు, ఆర్టికల్ 226 కింద నేరుగా హైకోర్టుకు రావడంపై ఆయన ప్రశ్నించారు. "ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకుని, మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ ఫలితం కోసం వేచి చూడటం మంచిది" అని ధర్మాసనం సూచించింది. హైకోర్టు సూచనను పరిగణనలోకి తీసుకున్న పిటిషనర్లు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో వారి పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.

డ్రోన్ల ఆట కట్టించేందుకు ఆర్మీకి కొత్త రాడార్లు..

రూ.770 కోట్లతో ఒప్పందం

భారత సైన్యం వైమానిక రక్షణ సామర్థ్యం పెంపే లక్ష్యం

చిన్న, అతి చిన్న డ్రోన్లను గుర్తించి ట్రాక్ చేయగల రాడార్లు

గగనతల లక్ష్యాలకు ప్రాధాన్యాన్ని నిర్ణయించే సాంకేతికత

2025-26లో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.78 లక్షల కోట్ల



అక్టోబర్ 21: (ప్రజావినికిడి):

రక్షణ ఎగుమతులు రూ.38,424 కోట్లకు పెరుగుదల సరిహద్దుల్లో డ్రోన్ల ముప్పును సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యానికి కొత్త రాడార్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం రక్షణ మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో రూ.770 కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. ఇంప్రూవ్డ్ లో-లెవల్ లైట్‌వెయిట్ రాడార్ వ్యవస్థలను సమకూర్చుకోవడమే ఈ ఒప్పందం లక్ష్యం. ఈ రాడార్లు సైన్యం వైమానిక రక్షణ సామర్థ్యాన్ని పెంచనున్నాయి.

ఈ రాడార్లతో యుద్ధ విమానాల పరిమాణంలో ఉండే లక్ష్యాలతో పాటు చిన్న, అతి చిన్న డ్రోన్లను గుర్తించి వాటి కదలికలను పర్యవేక్షించవచ్చు. గగనతలంలో గుర్తించిన లక్ష్యాల్లో ఏవి ఎక్కువ ప్రాధాన్యంతో ఎదుర్కోవాలో నిర్ణయించేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. దీంతో మానవరహిత వైమానిక వ్యవస్థల (యూఏఎస్) నుంచి ఎదురయ్యే ముప్పులను ఎదుర్కోవడంలో సైన్యానికి సహాయం అందనుంది. రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.


దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీని పెంచాలన్న లక్ష్యంలో భాగంగా ఈ కొనుగోలు చేపట్టినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనివల్ల దేశీయ రక్షణ పరిశ్రమతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈలు) కూడా అవకాశాలు పెరిగే వీలుంది.

గత దశాబ్దంలో భారత్ రక్షణ ఉత్పత్తుల తయారీలో గణనీయమైన వృద్ధిని సాధించింది. అధికారిక గణాంకాల ప్రకారం.. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.4,746 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల విలువ 2025-26లో రూ.1.78 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో రక్షణ ఎగుమతులు రూ.686 కోట్ల నుంచి రూ.38,424 కోట్లకు పెరిగాయి. భారత రక్షణ పరికరాలు ప్రస్తుతం 80కి పైగా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

2029 నాటికి ఏటా రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తుల తయారీ, రూ.50 వేల కోట్ల ఎగుమతులు సాధించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధికి కేటాయింపులను కూడా పెంచింది. 2026-27లో ఈ కేటాయింపులు రూ.29,100.25 కోట్లకు చేరాయి. పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు కొత్త రక్షణ సాంకేతికతలను అభివృద్ధి చేసేందుకు పరిశోధన బడ్జెట్‌లో 25 శాతాన్ని అందుబాటులో ఉంచింది.

దసరా పండుగ వేళ బంధించిన 4 పాలపిట్టలకు విముక్తి: సీపీ సజ్జనార్


అక్టోబర్ 21: (ప్రజావినికిడి):



దసరా పండుగ సందర్భంగా కొందరు స్వార్థపరులు బోనుల్లో బంధించిన తెలంగాణ రాష్ట్ర పక్షి 'పాలపిట్ట'లకు హైదరాబాద్ నగర పోలీసులు విముక్తి కల్పించారు. పౌరుల నుంచి అందిన పక్కా సమాచారంతో మూడు వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, మొత్తం నాలుగు పాలపిట్టలను కాపాడినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ వెల్లడించారు.దసరా పండుగ నాడు పాలపిట్టను చూడటం శుభసూచకంగా భావించే సంప్రదాయాన్ని కొందరు సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. మూగజీవాలను హింసిస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించినా, కొందరు వాటిని పెడచెవిన పెట్టారు. లంగర్‌హౌస్ బాపూఘాట్ వద్ద ఓ ఆలయం దగ్గర రెండు పాలపిట్టలను, ఛత్రినాక శ్రీ చిత్రగుప్త స్వామి ఆలయం వద్ద ఒకటి, మంగళ్‌హాట్ బాలాజీనగర్ ఆలయం సమీపంలో మరో పాలపిట్టను బోనుల్లో బంధించి ఉంచారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఆయా ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. తీవ్ర యాతనకు గురవుతున్న నాలుగు పాలపిట్టలను స్వాధీనం చేసుకుని, వాటిని కేబీఆర్ పార్క్ అటవీ శాఖ అధికారులకు సురక్షితంగా అప్పగించారు. ఈ ఘటనలకు పాల్పడిన నిందితులపై అటవీ శాఖ అధికారుల సమన్వయంతో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సజ్జనార్ తెలిపారు."స్వేచ్ఛగా ఎగరాల్సిన పక్షిని పండుగ పేరుతో బంధించి, తిండి, నీరు లేకుండా హింసించడం ఎవరికీ మంచిది కాదు. బోనులోని పక్షి ఆర్తనాదాలతో శుభం ఎలా కనిపిస్తుంది? జీవుల పట్ల కరుణ చూపడమే నిజమైన భక్తి కానీ, ప్రకృతిని బంధించడం కాదు" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి అమానవీయ చర్యలను ఎవరూ ప్రోత్సహించవద్దని, వన్యప్రాణులకు హాని తలపెట్టే ఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే 18004255364, 9803338666 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అమెరికాలో నిత్యం జరుగుతాయి

: భారత్‌లో నిరసనలపై మార్కో రూబియో



అక్టోబర్ 21:(ప్రజావినికిడి):

భారత్‌లో జరుగుతున్న నిరసనలపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు, రాజకీయ విభేదాలు సర్వసాధారణమని, ఇలాంటివి తమ దేశంలోనూ నిత్యం జరుగుతుంటాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో జరుగుతున్న నిరసనల గురించి విలేకరులు ప్రశ్నించగా ఆయన పైవిధంగా స్పందించారు.

భారత్‌లో నిరసనలను అణచివేసేందుకు ప్రభుత్వం మితిమీరిన బలప్రయోగం చేస్తోందంటూ ఐక్యరాజ్యసమితి నిపుణులు ఇటీవల చేసిన విమర్శలపైనా రూబియో అభిప్రాయం కోరారు. దీనిపై ఆయన బదులిస్తూ, "ఒక దేశ అంతర్గత అంశాల్లో నేను జోక్యం చేసుకోను. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థ. ప్రజలు బయటకు వచ్చి నిరసనలు చేస్తున్నారంటే, అక్కడ రాజకీయ చర్చలు, అభిప్రాయ భేదాలు ఉన్నాయని అర్థం. ఇది ఆరోగ్యకరమైన సంకేతమే," అని వివరించారు.ప్రస్తుతం మూడు రోజుల భారత పర్యటనలో ఉన్న మార్కో రూబియో.. గుజరాత్‌లోని జామ్‌నగర్‌ను సందర్శించనున్నారు. అక్కడ ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన చమురు శుద్ధి కర్మాగారాన్ని పరిశీలిస్తారు. ఈ సందర్భంగా ఆయన భారత్‌ను "రిఫైనింగ్ సూపర్‌పవర్"గా అభివర్ణించారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో, వెనెజువెలా చమురుకు అమెరికా కొత్త మార్కెట్లను అన్వేషిస్తున్న తరుణంలో రూబియో పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య ఇంధన, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా సాగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

చంద్రబాబు, జగన్‌లకు ప్రత్యామ్నాయం లేదా ?

అక్టోబర్ 21(ప్రజావినికిడి):



దేశంలో అనేక రాష్ట్రాలు ఉన్నాయి. కానీ ఏ రాష్ట్రంలోనూ లేని విచిత్ర పరిస్థితి ఏపీలో ఉంది. ఇక్కడ రెండే పార్టీలు. ఇద్దరే నాయకులు. వారి మధ్యనే రాజకీయం. వారితోనే రాజకీయం. అలా ఏపీ పాలిటిక్స్ నిలువునా చీలిపోయింది. చంద్రబాబు జగన్ ఈ ఇద్దరి చుట్టూనే ఏపీ రాజకీయం అంతా ఏళ్ళకు ఏళ్ళుగా తిరుగుతోంది. ఈ ఇద్దరే ఏపీకి గతం, వర్తమానం భవిష్యత్తు అన్నట్లుగా ఉన్నారు. ఈ ఇద్దరే విభజన ఏపీలో పాలకులు అయ్యారు. మరి వీరి ప్రభుత్వాలలో సగటు జనం జీవితాలలో వచ్చిన మార్పు ఎంత, అలాగే కేవలం సంక్షేమ పథకాలు తప్ప రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త దారి ఏది ఇవన్నీ ప్రశ్నలు. అంతే కాదు ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు ఒక ఆసక్తికరమైన ప్రశ్న వినిపిస్తోంది. చంద్రబాబు జగన్ కాకుండా మరో నాయకుడు రాష్ట్ర రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదగగలడా అలాంటి పరిస్థితులు ఉన్నాయా అన్నదే కీలకమైన చర్చగా ఉంది ఏపీలో మూడు ఎన్నికలు చంద్రబాబు జగన్ ల మధ్యనే సాగాయి. వీరిలో ఒకరు అధికారంలో ఉంటే మరొకరు ప్రతిపక్షంలో ఉంటారు. ఎన్నికలు వచ్చినప్పుడు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటారు. ఈ ఇద్దరి మధ్య ఢీ కొట్టే రాజకీయ పోటీలో సాధారణ ప్రజలకు దీర్ఘకాలంలో ఎంత ప్రయోజనం కలుగుతోందన్నది అయితే అంతా కచ్చితంగా చర్చించాల్సిన అంశం అని మేధావులు సైతం అంటున్నారు. చంద్రబాబు విషయానికి వస్తే అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతికత, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతారు. జగన్ సంక్షేమం, సామాజిక న్యాయం, పేదల ఆర్థిక భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతారు. ఇలా చూస్తే ఈ వీరిద్దరి పాలనా విధానాలు పూర్తిగా ఒకటే అనడం సరికాదు. అయితే రాజకీయ శైలి మాత్రం ఒక్కటే అని అంటున్నారు. తామే కీలకంగా ఉంటూ తమ చుట్టూనే అధికార కేంద్రీకరణ చేసుకోవడం, తమ ఇమేజ్ తోనే అంతా అనుకోవడం, ఇక ఖజానాను అసలు ఖాతరు చేయకుండా సంక్షేమ పథకాలపై ఎందాకైనా అన్నట్లుగా పోటీ, పరస్పర రాజకీయ విమర్శలు వంటి అంశాలలో సైతం ఇద్దరూ ఒక్కటే తీరు అని విశ్లేషిస్తున్నారు.ఇక ఏపీ అంటే అయిదు కోట్ల జనం, ఎందరో ఆశలు, ఆకాంక్షలు ముడిపడి ఉన్న అతి పెద్ద సమాజం. యువతకు ఉపాధి కావాలి. సగటు జనం ఆర్థికంగా పైకి లేవాలి, రాష్ట్రం సమగ్రమైన అభివృద్ధి సాధించాలి. కానీ బాబు జగన్ ల మధ్యనే పరిమితం అయిన రాజకీయం ఒక అజెండాను సెట్ చేసేసింది. అందుకే ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా సంక్షేమ పథకాలు కీలకమైన రాజకీయ అంశంగా మారుతున్నాయి. చదువుకున్న యువత పరాయి రాష్ట్రంలో కొలువులకు పోతోంది, వారికి ఉద్యోగాలు ఎక్కడ అంటే జవాబు లేదు, సామాజిక పెన్షన్లు, మహిళలకు ఆర్థిక సహాయం, రైతులకు మద్దతు, విద్యార్థులకు సహాయం ఇలా ఎన్నో ఉచిత పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడతాయి. వాటి అవసరాన్ని ఎవరూ తక్కువ చేయలేరు. అదే సమయంలో అభివృద్ధి కూడా ఏపీకి అవసరం అన్నది సగటు జనం ఆలోచిస్తున్న విషయంగా ఉంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

స్మృతి మంధాన రికార్డును బద్దలు కొట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్.



జింబాబ్వేతో మూడో, చివరి టీ20లో భారత్ 92 పరుగుల భారీ విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఈ మ్యాచ్‌లో మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుత ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 41 బంతుల్లో 91 పరుగులతో అజేయంగా నిలిచి భారత్ భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించింది.హర్మన్ప్రీత్ ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 5 సిక్సర్లు ఉన్నాయి. ఆమె ధాటికి భారత్ 20 ఓవర్లలో 216/7 పరుగులు చేసింది. అంతకుముందు షఫాలీ వర్మ (37 బంతుల్లో 69 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడింది.భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన జింబాబ్వే 20 ఓవర్లలో 124/7 మాత్రమే చేయగలిగింది. దీంతో భారత్ 92 పరుగుల తేడాతో ఘన విజయం అందుకుంది.స్మృతి మంధాన రికార్డు ద్దలు..హర్మన్‌ప్రీత్ కౌర్ 91 పరుగులు చేయడంతో మరో ప్రత్యేక రికార్డు ఆమె ఖాతాలో చేరింది. స్వదేశంలో భారత మహిళల తరఫున టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన బ్యాటర్‌గా హర్మన్‌ప్రీత్ నిలిచింది.ఇప్పటివరకు ఈ రికార్డు స్మృతి మంధాన పేరిట ఉంది. 2025లో శ్రీలంకపై మంధాన 48 బంతుల్లో 80 పరుగులు చేసింది. ఇప్పుడు హర్మన్‌ప్రీత్ 91 పరుగులతో ఆ రికార్డును అధిగమించింది.స్వదేశంలో భారత మహిళల టీ20ల్లో అత్యధిక స్కోర్లు..-- హర్మన్‌ప్రీత్ కౌర్ -- 91 (41 బంతులు, 10 ఫోర్లు, 5 సిక్సర్లు)లి ఐం జింబాబ్వే, రాయ్‌పూర్, అక్టోబర్ 20, 2026-- స్మృతి మంధాన -- 80 (48 బంతులు, 11 ఫోర్లు, 3 సిక్సర్లు) ఐం శ్రీలంక, తిరువనంతపురం, డిసెంబర్ 28, 2025-- షఫాలీ వర్మ -- 79 (42 బంతులు, 11 ఫోర్లు, 3 సిక్సర్లు)లి ఐం శ్రీలంక, తిరువనంతపురం, డిసెంబర్ 26, 2025-- స్మృతి మంధాన -- 79 (49 బంతులు, 9 ఫోర్లు, 4 సిక్సర్లు) ఐం ఆస్ట్రేలియా, నవీ ముంబై, డిసెంబర్ 11, 2022-- షఫాలీ వర్మ -- 79 (46 బంతులు, 12 ఫోర్లు, 1 సిక్సర్) ఐం శ్రీలంక, తిరువనంతపురం, డిసెంబర్ 28, 2025షఫాలీతో కలిసి భారత్‌కు అదిరిపోయే ఆరంభంకెప్టెన్ స్మృతి మంధాన ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగకుండా ఇతర బ్యాటర్లకు ఎక్కువ సమయం ఇవ్వాలని నిర్ణయించుకుంది. దీంతో షఫాలీ వర్మతో కలిసి అనుష్క శర్మ (ఓపెనర్‌గా వచ్చింది.అనుష్క 20 బంతుల్లో 28 పరుగులు చేసింది. షఫాలీ వరుసగా రెండో అర్ధసెంచరీ నమోదు చేస్తూ భారత్ స్కోరును వేగంగా పెంచింది. వీరిద్దరూ కలిసి కేవలం 32 బంతుల్లో 54 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.

60 ఏళ్ల తర్వాత తొలిసారి.. ఆస్ట్రేలియాపై మార్కో జాన్సెన్ అరుదైన రికార్డ్..!



ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టు మూడో రోజు మార్కో జాన్సెన్ అద్భుత బ్యాటింగ్‌తో ప్రత్యేక రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దక్షిణాఫ్రికా 110/6తో కష్టాల్లో ఉన్న సమయంలో నంబర్ 8 స్థానంలో క్రీజులోకి వచ్చిన జాన్సెన్.. కెప్టెన్ టెంబా బవుమాతో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.ఇద్దరూ కలిసి 132 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను తిరిగి గాడిలో పెట్టారు. జాన్సెన్ 100 బంతుల్లో 85 పరుగులు చేశాడు. ఇందులో అతని బ్యాటింగ్ ఎంతో కీలకంగా నిలిచింది. అయితే సెంచరీకి చేరువైన సమయంలో స్కాట్ బోలాండ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు.60 ఏళ్ల నాటి రికార్డు బద్దలు..జాన్సన్ 85 పరుగులు చేయడంతో స్వదేశంలో ఆస్ట్రేలియాపై టెస్టుల్లో దక్షిణాఫ్రికా నంబర్ 8 బ్యాటర్‌గా అత్యధిక స్కోరు చేసిన ఆటగాడిగా నిలిచాడు.ఇంతకుముందు ఈ రికార్డు పీటర్ వాన్ డెర్ మెర్వే పేరిట ఉండేది. 1966లో జోహన్నెస్‌బర్గ్‌లో ఆస్ట్రేలియాపై ఆయన 76 పరుగులు చేశారు. ఇప్పుడు జాన్సెన్ 85 పరుగులతో ఆ దాదాపు ఆరు దశాబ్దాల నాటి రికార్డును అధిగమించాడు.ఆస్ట్రేలియాపై టెస్టుల్లో నంబర్ 8గా అత్యధిక స్కోర్లు..అయితే ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా నంబర్ 8 బ్యాటర్‌గా అత్యధిక స్కోరు చేసే రికార్డును జాన్సెన్ అందుకోలేకపోయాడు.ఈ జాబితాలో బ్రయాన్ మెక్‌మిలన్ అగ్రస్థానంలో ఉన్నాడు. 1998లో అడిలైడ్ ఓవల్‌లో ఆయన అజేయంగా 87 పరుగులు చేశాడు. జాన్సెన్ 85 పరుగులతో రెండో స్థానంలో నిలిచాడు.బవుమా కూడా అరుదైన రికార్డు...మార్కో జాన్సెన్‌తో పాటు దక్షిణాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా కూడా ఈ మ్యాచ్‌లో ప్రత్యేక రికార్డు సాధించాడు. ఆస్ట్రేలియాపై వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) మ్యాచ్‌లో సెంచరీ చేసిన అత్యంత పెద్ద వయసున్న కెప్టెన్‌గా బవుమా నిలిచాడు.మ్యాచ్ ప్రారంభమైన సమయంలో బవుమా వయసు 36 సంవత్సరాల 154 రోజులు. దీంతో 2023లో నాగ్‌పూర్ టెస్టులో 35 సంవత్సరాల 285 రోజుల వయసులో సెంచరీ చేసిన రోహిత్ శర్మ (=శీష్ణత్ శ్మష్ణుతీఱ్ఱి) రికార్డును అతను అధిగమించాడు.

రూ. 5 కోట్లు నష్టపోయిన టీమిండియా ప్లేయర్..!



సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు ఆసక్తికరమైన వార్త. జట్టు మాజీ పేసర్ టీ. నటరాజన్ మరోసారి సన్‌రైజర్స్ హైదరాబాద్ లోకి అడుగుపెట్టనున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ట్రేడ్‌లో భాగంగా నటరాజన్‌ను హైదరాబాద్ ఫ్రాంచైజీ తిరిగి తీసుకుంది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ తమ ఆటగాళ్లను ట్రేడ్ చేసుకున్నా యి. ఈ డీల్‌లో భాగంగా ఢిల్లీ బౌలర్ నటరాజన్ ూ=ఎలోకి రాగా.. ూ=ఎకు చెందిన లెగ్ స్పిన్నర్ అనారీ ఢిల్లీ జట్టులోకి వెళ్లినట్లు సమాచారం.2020 నుంచి 2024 వరకు ూ=ఎతో నటరాజన్నటరాజన్ గతంలో 2020 నుంచి 2024 వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కొనసాగాడు. ఈ కాలంలో జట్టు బౌలింగ్ విభాగంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా 2024 సీజన్‌లో తన బౌలింగ్‌తో సత్తా చాటాడు. 2024 ూూ సీజన్‌లో 19 వికెట్లు తీసుకున్న నటరాజన్‌పై ఫ్రాంచైజీల ఆసక్తి పెరిగింది. ఆ తర్వాత జరిగిన 2025 వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని రూ.10.75 కోట్లకు దక్కించుకుంది.రూ.10.75 కోట్ల నుంచి రూ.5 కోట్లకు..ఢిల్లీ క్యాపిటల్స్ కోసం ఆడిన తర్వాత ఇప్పుడు నటరాజన్ మళ్లీ తన పాత జట్టు ూ=ఎకు చేరుతున్నాడు. ఈసారి సన్‌రైజర్స్ అతడిని రూ.5 కోట్లకు తిరిగి తీసుకున్నట్లు సమాచారం. అంటే 2025 వేలంలో ఢిల్లీ చెల్లించిన రూ.10.75 కోట్లతో పోలిస్తే, ఇప్పుడు ూ=ఎ అతడిని తక్కువ మొత్తానికే జట్టులోకి తీసుకొచ్చింది. దీంతో హైదరాబాద్ ఫ్రాంచైజీ పాత ఆటగాడిపై మరోసారి నమ్మకం ఉంచినట్లు కనిపిస్తోంది.ూ=ఎ బౌలింగ్‌కు మరింత బలం?నటరాజన్ తిరిగి రావడం సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ విభాగానికి ఉపయోగపడే అవకాశం ఉంది. గతంలో ూ=ఎ తరఫున ఆడిన అనుభవం కూడా అతడికి ఉంది. 2024లో 19 వికెట్లతో చూపించిన ప్రదర్శనను మళ్లీ కొనసాగిస్తే జట్టుకు కీలక బౌలర్‌గా మారే అవకాశం ఉంది.మరోవైపు ఈ ట్రేడ్‌తో ూ=ఎకు చెందిన లెగ్ స్పిన్నర్ అనారీ ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి వెళ్లనున్నాడు. దీంతో రెండు ఫ్రాంచైజీలు తమ అవసరాలకు అనుగుణంగా ఆటగాళ్లను మార్చుకున్నాయి. సన్‌రైజర్స్ అభిమానులకు మాత్రం పాత పరిచయమైన నటరాజన్ మళ్లీ ఆరెంజ్ జెర్సీలో కనిపించనున్నాడనే వార్త ప్రత్యేక ఆకర్షణగా మారింది.

మీకు తెలియకుండా బ్యాంక్ అకౌంట్లో డబ్బులు కట్ అయ్యాయా..?



భారత స్టాక్ మార్కెట్‌లో కొన్ని కంపెనీల షేర్లు దీర్ఘకాలంలో అద్భుతమైన రాబడులను అందిస్తూ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తుంటాయి. అలాంటి కంపెనీల్లో ఒకటి. కండోమ్‌లు, ఇతర నిరోధక ఉత్పత్తులను తయారు చేసే ఈ కంపెనీ షేరు గత పదేళ్లలో సుమారు 14,057 శాతం రాబడిని అందించినట్లు నివేదికలు చెబుతున్నాయి. దీంతో ఈ స్టాక్ మరోసారి మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది.
కుపిడ్ లిమిటెడ్ అంటే ఏమిటి?కుపిడ్ లిమిటెడ్ భారతదేశానికి చెందిన ఒక తయారీ సంస్థ. ఈ కంపెనీ పురుషుల కండోమ్‌లు, మహిళల కండోమ్‌లు, నీటి ఆధారిత లూబ్రికెంట్ జెల్లీ, వైద్య పరీక్షలకు ఉపయోగించే ×ఎణ కిట్లను తయారు చేస్తుంది. కంపెనీకి స్వంత పరిశోధన, అభివృద్ధి కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ తన ఉత్పత్తులను విక్రయిస్తోంది.పదేళ్లలో 14,057 శాతం రాబడి.. ఎంత పెరిగింది?కుపిడ్ లిమిటెడ్ షేరు పదేళ్ల కాలంలో సుమారు 14,057 శాతం రాబడిని అందించింది. అంటే, షేరు ధరలో వచ్చిన పెరుగుదల దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు గణనీయమైన లాభాలను అందించింది. అయితే, ఈ రాబడి గత పనితీరుకు సంబంధించినది మాత్రమే. భవిష్యత్తులోనూ ఇదే స్థాయిలో లాభాలు వస్తాయని హామీ లేదు.కుపిడ్ లిమిటెడ్ షేరు బీఎస్ఈలో సుమారు 3 శాతం పెరిగి రూ.368 స్థాయిలో కొత్త గరిష్ఠాన్ని తాకింది.కాలవ్యవధి నివేదించిన షేరు పెరుగుదల, రాబడి
ఒక నెలలో సుమారు 28%, ఆరు నెలల్లో 289% కంటే ఎక్కువ, అదే ఒక సంవత్సరంలో 650% కంటే ఎక్కువ, రెండు సంవత్సరాలలో సుమారు 2,121%, మూడు సంవత్సరాలలో సుమారు 8,605%, ఐదు సంవత్సరాలలో సుమారు 15,301% శాతం పెరుగుదల నమోదైనట్లు కంపెనీ నివేదికలు చెబుతున్నాయి. కండోమ్‌లు, ఇతర వ్యక్తిగత ఆరోగ్య ఉత్పత్తులను తయారు చేసే కుపిడ్ లిమిటెడ్ షేరు గత పదేళ్లలో అందించిన భారీ రాబడితో ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించింది. అయితే, గతంలో వచ్చిన లాభాలు భవిష్యత్తులోనూ వస్తాయని చెప్పలేం. పెట్టుబడి పెట్టే ముందు పూర్తి వివరాలను పరిశీలించి, అవసరమైతే ఆర్థిక సలహాదారుని సంప్రదించాలి.బోనస్ షేర్లను ఎప్పుడు, ఎక్కడ ఇచ్చారు?
ఈ కంపెనీ తన వాటాదారులను చాలా సంతోషపెట్టింది. ఈ కంపెనీ మార్చి 2026లో ఒక షేరుకు 4 (1:4) బోనస్ షేర్లను ఇచ్చింది. అంతకుముందు, 2024లో 1:1 నిష్పత్తిలో, 2018లో 5:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ఇచ్చారు.

ఒప్పో ఎఫ్-సిరీస్ 10 ఏళ్ల పండుగ.. మార్కెట్లోకి అదిరిపోయే ఒప్పో ఖీ35 5జీ సిరీస్ మోడళ్లు!



స్మార్ట్‌ఫోన్ రష్యా మార్కెట్‌లో తనదైన స్టైల్, అత్యాధునిక కెమెరా ఫీచర్లతో మంచి ఆదరణ పొందిన ఒప్పో (ూూూ) సంస్థ భారత మార్కెట్‌లో ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. భారత్‌లోకి ఒప్పో ఎఫ్ సిరీస్ అడుగుపెట్టి 10 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కొత్తగా ూూూ ఖీ35 ూవతీఱవం స్మార్ట్‌ఫోన్‌లను అధికారికంగా లాంచ్ చేసింది. ఈ లైనప్‌లో ూూూ ఖీ35 రెండు పవర్‌ఫుల్ మోడళ్లను పరిచయం చేసింది.50ూీ అల్ట్రా-వైడ్ గ్రూప్ సెల్ఫీ కెమెరాముఖ్యంగా నేటి తరం యువత, సోషల్ మీడియా క్రియేటర్లు, ఫొటోగ్రఫీ ప్రేమికులను దృష్టిలో ఉంచుకుని కంపెనీ ఈ ఫోన్లను డిజైన్ చేసింది. ఇందులో 50 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ ఫ్రంట్ కెమెరాను అందించారు. ఇది 100 డిగ్రీల ఫీల్డ్ ఆఫ్ వ్యూని ఇస్తుంది. దీనివల్ల గ్రూప్ సెల్ఫీలు దిగినప్పుడు ఎవరూ కట్ అవ్వకుండా ఒకే ఫ్రేమ్‌లో పర్ఫెక్ట్‌గా ఫిట్ అవుతారు. ప్రో మోడల్‌లో ముందు, వెనుక కెమెరాలతో 4ఖ వీడియో రికార్డింగ్ సదుపాయం, ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ూ×ూ) సపోర్ట్ ఉంది.అద్భుతమైన డిస్‌ప్లే, ప్రాసెసర్‌ప్రీమియం మోడల్ అయిన ూూూ ఖీ35 5జీ సిరీస్ మోడళ్లు!
ఇస్తుంది. దీనివల్ల గ్రూప్ సెల్ఫీలు దిగినప్పుడు ఎవరూ కట్ అవ్వకుండా100 డిగ్రీల ఫీల్డ్ ఆఫ్ వ్యూని ఇస్తుంది. దీనివల్ల గ్రూప్ సెల్ఫీలు దిగినప్పుడు ఎవరూ కట్ అవ్వకుండా ఒకే ఫ్రేమ్‌లో పర్ఫెక్ట్‌గా ఫిట్ అవుతారు. ప్రో మోడల్‌లో ముందు, వెనుక కెమెరాలతో 4ఖ వీడియో రికార్డింగ్ సదుపాయం, ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ూ×ూ) సపోర్ట్ ఉంది.అద్భుతమైన డిస్‌ప్లే, ప్రాసెసర్‌ప్రీమియం మోడల్ అయిన ూూూ ఖీ2ఘ్ష రేట్ కలిగిన ూూూూజుణ డిస్‌ప్లేను అందించారు. దీనివల్ల గేమింగ్, వీడియోగ్రాఫీ, స్క్రోలింగ్ అనుభవం ఎంతో మృదువుగా ఉంటుందిా ఒకే ఫ్రేమ్‌లో పర్ఫెక్ట్‌గా ఫిట్ అవుతారు. ప్రో మోడల్‌లో ముందు, వెనుక కెమెరాలతో 4ఖ వీడియో రికార్డింగ్ సదుపాయం, ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ూ×ూ) సపోర్ట్ ఉంది.అద్భుతమైన డిస్‌ప్లే, ప్రాసెసర్‌ప్రీమియం మోడల్ అయిన

ఈ 4 సంకేతాలు కనిపిస్తే జాగ్రత్త.



. ఎస్‌బీఐ హెచ్చరిక.. అవేంటో తెలుసా..?
సోషల్ మీడియా, వాట్సాప్, టెక్స్ట్ మెసేజ్‌లు లేదా ఈమెయిల్‌ల ద్వారా మీకు నెలకు 30% రాబడి ఇస్తామన్న ఆఫర్లు వస్తుంటే జాగ్రత్తగా ఉండండి. ఇలాంటి ఆకర్షణీయమైన వాగ్దానాలు గణనీయమైన ఆర్థిక నష్టాలకు దారితీయవచ్చు. దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటైన ఎస్‌బిఐ, మోసపూరిత పెట్టుబడి పథకాల గురించి పెట్టుబడిదారులను హెచ్చరించింది. త్వరితగతిన, అధిక లాభాలు ఇస్తామని ఆశ చూపి సైబర్ నేరగాళ్లు ప్రజల కష్టార్జితాన్ని దోచుకోగలరని ఆ బ్యాంకు పేర్కొంది. అందువల్ల ఏదైనా పెట్టుబడి ఆఫర్‌ను నమ్మే ముందు దాని ప్రామాణికతను ధృవీకరించుకోవడం చాలా ముఖ్యం. దీని గురించి వివరంగా తెలుసుకుందాం.ఎస్‌బీఐ ఎందుకు హెచ్చరిక జారీ చేసింది?
అక్టోబర్ 12న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ శలో ఒక పోస్ట్ ద్వారా ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ూదీ× పెట్టుబడిదారులకు సూచించింది. ఈ సందేశం బ్యాంకు 'జాతీయ సైబర్ భద్రతా మాసోత్సవ ప్రత్యేక ప్రచారం 6.0'లో భాగంగా ఉంది . నెలకు 30% రాబడి వంటి వాగ్దానాలు మోసం కావచ్చని బ్యాంకు స్పష్టం చేసింది. మోసగాళ్లు తక్కువ సమయంలో ధనవంతులు కావాలనే కలలతో ప్రజలను ఆకర్షించి, ఆ తర్వాత పెట్టుబడి పేరుతో డబ్బు బదిలీ చేసేలా వారిని మోసం చేస్తారు. అటువంటి పరిస్థితిలో పెట్టుబడిదారులు తొందరపడకుండా ఆ ఆఫర్ విశ్వసనీయతను తనిఖీ చేసుకోవాలి.. విశ్వసనీయమైన ఆర్థిక మార్గాలను మాత్రమే ఉపయోగించాలి.సైబర్ నేరగాళ్లు ఎలా పనిచేస్తారు?
సైబర్ నేరగాళ్లు ప్రజలను వలలో వేయడానికి రకరకాల పద్ధతులను ఉపయోగిస్తారు. కొన్నిసార్లు వారు సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ప్రకటనలను ప్రదర్శిస్తారు, మరికొన్నిసార్లు గుర్తుతెలియని నంబర్ల నుండి పెట్టుబడి ఆఫర్లను అందిస్తూ సందేశాలు పంపుతారు. కొన్ని సందర్భాల్లో వారు నకిలీ వెబ్‌సైట్లు, మోసపూరిత పెట్టుబడి యాప్‌లు, కల్పిత కస్టమర్ రివ్యూల ద్వారా ప్రజల నమ్మకాన్ని పొందడానికి ప్రయత్నిస్తారని, ఇలాంటివి నమ్మితే

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



నా బాడీ, నా ఇష్టం...!


పాయల్ రాజ్‌పూత్

పాయల్ రాజ్‌పూత్ ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలు, వీడియోలు చర్చనీయాంశం అయ్యాయి. ఆ ఫోటోలు, వీడియోలకు కొందరు చేసిన నెగిటివ్ కామెంట్స్ శృతి మించాయి. ఆమె శరీరాకృతిని గురించి, ఆమె బాడీ లాంగ్వేజ్ గురించి ఇంకా చాలా విషయాల గురించి నెగిటివ్‌గా మాట్లాడుతూ చాలా మంది సోషల్ మీడియాలో చేసిన కామెంట్స్ చర్చనీయాంశం అయ్యాయి. సోషల్ మీడియాలో వైరల్ అయిన పాయల్ రాజ్‌పూత్ వీడియోలు, ఆ వీడియోలకు వచ్చిన కామెంట్స్ ఇప్పుడు అందరి దృష్టి ఆకర్షించే విధంగా చేశాయి. తన గురించి కొందరు చేస్తున్న విమర్శలకు పాయల్ ధీటుగా సమాధానం ఇచ్చింది. తన గురించి సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తూ, ట్రోల్ చేసిన వారిని సిగ్గు ఉండాలి అంటూ పరుష పదజాలంతో స్పందిస్తూ కౌంటర్ ఇవ్వడంతో పాయల్ రాజ్‌పూత్ పై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది హీరోయిన్స్ తమను ఎంత ట్రోల్ చేసినా, చివరకు బాడీ షేమింగ్ చేసినా నోరుమూసుకుని ఉంటున్నారు. దాంతో బాడీ షేమింగ్ చేస్తున్న వారు మరింత పేట్రేగి పోతున్నారు. ఇప్పుడు పాయల్ రాజ్‌పూత్ తన గురించి కామెంట్ చేసిన వారికి గట్టి సమాధానం ఇవ్వడంతో కొంత మేరకు అయినా ట్రోల్స్ తగ్గుతాయి. సెలబ్రిటీలు ముఖ్యంగా హీరోయిన్స్ తమ బాడీ గురించి కొందరు చేసే కామెంట్స్ ను ఉపేక్షించవద్దని చాలా మంది అంటున్నారు. ఒక సారి నెగిటివ్ ట్రోలింగ్, బాడీ షేమింగ్ కామెంట్స్ ప్రారంభం అయితే, ఒకరిని చూసి ఒకరు అన్నట్టు వరుసగా కామెంట్స్ చేసే వారు పెరుగుతూనే ఉంటారు. మొదట్లోనే ఆ ట్రోల్స్ కు గట్టి సమాధానం చెప్తే ఆ తర్వాత ట్రోల్ చేయాలి అనుకునే వారు, బాడీ షేమింగ్ కు పాల్పడే వారు జాగ్రత్త పడుతారు. ఇప్పుడు పాయల్ ఇచ్చిన ఘాటు రిప్లే కి చాలా మంది ఆమెను ట్రోల్ చేసేందుకు వెనుకాడుతారు అనడంలో సందేహం లేదు.పాయల్ రాజ్‌పూత్ స్ట్రాంగ్ కౌంటర్... సోషల్ మీడియా ద్వారా పాయల్ రాజ్‌పూత్ తనపై వస్తున్న ట్రోల్స్‌కి సమాధానం ఇచ్చింది. ఎక్స్‌లో పాయల్ ఒక పోస్ట్‌లో... సిగ్గు పడండి, నా శరీరం, నా సైజు, నా ఇష్టం. నా ఆత్మగౌరవం గురించి మీ చర్చ మీ అభిప్రాయాలు అక్కర్లేదు. మీ సభ్యత ను మర్చిపోయి చేస్తున్న కామెంట్స్ ను హద్దుల్లో పెట్టుకోండి. మీ అభిప్రాయాలను మీ వద్దే పెట్టుకుని హద్దులో ఉండండి. మీ పని మీరు చూసుకోండి అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. పాయల్ గురించి బాడీ షేమింగ్ చేస్తున్న వారిపై ఆమె అభిమానులు సైతం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నెగెటివ్ కామెంట్స్ చేసిన వారిపై పాయల్ అభిమానులు తీవ్రమైన పదజాలంతో దూషిస్తూ కౌంటర్ ఇచ్చారు. మొత్తానికి పాయల్ రాజ్ పూత్ గత కొన్ని రోజులుగా జరుగుతున్న బాడీ షేమింగ్ కు గట్టిగా సమాధానం ఇవ్వడంతో ఇక మీదట ఆమెకు కాస్త ఊరట దక్కే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆసక్తి రేపుతున్న 'ఆది రుద్ర'

పాన్ ఇండియా థ్రిల్లర్‌తో ఆది సాయికుమార్..

యువ హీరో ఆది సాయికుమార్ తన తదుపరి చిత్రాన్ని ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'ఆది రుద్ర' అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేశారు. త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై మంగళవారం ఈ ప్రాజెక్టును అధికారికంగా అనౌన్స్ చేశారు. విశ్వాసం, రహస్యం, ఉత్కంఠభరిత అంశాలతో సాగే ఒక డివైన్ మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో ఆది సాయికుమార్‌ను మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో చూపించనున్నట్లు తెలుస్తోంది.'దండుపాళ్యం', 'కృష్ణ ప్రణయ సఖి' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన ప్రశాంత్ జి. రుద్రప్ప ఈ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ఇది మూడో ప్రాజెక్ట్. నవరసన్ ఈ చిత్రానికి కథ, దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. 'ఆది రుద్ర' కథ 1960 నుంచి 1990 మధ్య కాలంలో సాగుతుందని, ఆ కాలం నాటి



వాతావరణాన్ని ప్రతిబింబించేలా విజువల్స్, పాత్రలు, కథనం ఉంటాయని దర్శకుడు తెలిపారు. ప్రేక్షకులను ఒక ఆధ్యాత్మిక, రహస్య ప్రపంచంలోకి తీసుకెళ్లేలా సినిమా ఉంటుందని చెబుతున్నారు.

ఈ చిత్రానికి సంబంధించిన సాంకేతిక బృందం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. 'కాంతార', 'విరూపాక్ష', 'మంగళవారం', 'మహారాజ' వంటి సెన్సేషనల్ హిట్స్‌కు సంగీతం అందించిన ప్రముఖ సంగీత దర్శకుడు బి. అజనీష్ లోక్‌నాథ్ 'ఆది రుద్ర'కు స్వరాలు సమకూరుస్తున్నారు. ఎ.జె. శెట్టి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేయనున్నారు.భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో రూపుదిద్దుకోనున్న ఈ సినిమా చిత్రీకరణను వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు, కన్నడ, తమిళం, హిందీ, మలయాళం భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను గోప్యంగా ఉంచినప్పటికీ, షూటింగ్ ప్రారంభమయ్యాక త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

దలేర్ మెహందీకి అవమానం..

మంత్రిపై అనుపమ్ ఖేర్ అసహనం

ప్రముఖ పంజాబీ గాయకుడు దలేర్ మెహందీకి సీనియర్ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ అండగా నిలిచారు. ఓ కార్యక్రమంలో దలేర్ మహెందీని మంత్రి అవమానించిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఉత్తరాఖండ్‌లో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో దలేర్ మెహందీ ప్రదర్శన ఇస్తుండగా, రాష్ట్ర మంత్రి సుబోధ్ ఉనియాల్ వేదికపైకి వచ్చి ఆయనను తీవ్రంగా అవమానించారు. "మద్యం తాగి పాడుతున్నావు" అంటూ అందరి ముందు ఆరోపించడంతో ఈ వివాదం చెలరేగింది.

ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవడంతో అనుపమ్ ఖేర్ స్పందించారు. దలేర్ మెహందీకి అండగా నిలుస్తూ ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేశారు. "నాకు తెలిసినంత వరకు దలేర్ మద్యం సేవించరు. నేను కలిసిన మంచి వ్యక్తులలో ఆయన ఒకరు. గత రెండు, మూడేళ్లుగా ఆయన ఆరోగ్యం కూడా సరిగా లేదు.



బహుశా నిర్వాహకులకు ముందుగా ఇచ్చిన మాట కోసమే ఆయన ఆ ప్రదర్శనకు హాజరై ఉంటారు. మాట నిలబెట్టుకోవడం ఆయన వృత్తిపట్ల ఉన్న నిబద్ధతను చూపుతుంది" అని అనుపమ్ పేర్కొన్నారు.

మంత్రి ప్రవర్తనను తప్పుబడుతూ "సోషల్ మీడియాలో ఆ వీడియో చూసి నాకు చాలా బాధేసింది. బహిరంగ వేదికపై ఎవరూ ఎవరితోనూ అలా మాట్లాడకూడదు. ఇది అన్యాయం. ఒక గాయకుడిని అందరి ముందు విమర్శించడం సరికాదు. ప్రదర్శనపై మీకు కోపం ఉంటే, అదే విషయాన్ని విడిగా, గౌరవంగా కూడా చెప్పవచ్చు కదా? వేదికపైకి వెళ్లి అవమానించాల్సిన అవసరం ఏముంది?" అని అనుపమ్ ఖేర్ ప్రశ్నించారు.

ఈ ఘటన దలేర్‌కు ఎదురైనందుకు తాను చాలా బాధపడుతున్నానని, మంత్రి ప్రవర్తనకు తాను సిగ్గుపడుతున్నానని అన్నారు. ఈ క్రమంలో మంత్రి తరఫున తానే దలేర్ మెహందీకి క్షమాపణలు చెబుతున్నానని అనుపమ్ ఖేర్ వ్యాఖ్యానించారు. ఈ సంఘటన కళాకారుల పట్ల ప్రజా ప్రతినిధులు వ్యవహరించాల్సిన తీరుపై చర్చకు దారితీసింది



'రామాయణ'కు క్లీన్ 'యూ' సర్టిఫికెట్.. భారీ రన్‌టైమ్‌తో వస్తున్న చిత్రం!

దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'రామాయణ'. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు సంబంధించి ఒక ముఖ్యమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషో ప్రకారం, ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు క్లీన్ 'యూ' సర్టిఫికెట్ జారీ చేసింది. దీంతో ఎలాంటి వయోపరిమితి లేకుండా అందరూ ఈ చిత్రాన్ని థియేటర్లలో వీక్షించవచ్చు.బుక్‌మైషోలో పొందుపరిచిన వివరాల ప్రకారం.. 'రామాయణ' సినిమా నిడివి 3 గంటల 15 నిమిషాలుగా ఉంది. అయితే, ఈ సమాచారం ఇంకా 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (సీబీఎఫ్‌సీ) అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు కాలేదు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని, బుక్‌మైషోలో ఉన్న వివరాలే దాదాపుగా ఖరారయ్యే సూచనలు కనిపిస్తున్నాయని తెలుస్తోంది.ఇతిహాస గాథ అయిన రామాయణాన్ని వెండితెరపై ఆవిష్కరిస్తున్నందున, ఇంత భారీ రన్‌టైమ్ అవసరమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్, యశ్, సాయి పల్లవి ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

అశ్వనీదత్, స్వప్న దత్ చేతుల మీదుగా

'సన్ ఆఫ్ కనకదుర్గమ్మ' పోస్టర్ రిలీజ్



దసరా పండుగను పురస్కరించుకుని 'సన్ ఆఫ్ కనకదుర్గమ్మ' చిత్ర బృందం ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రముఖ నిర్మాత అశ్వనీదత్, ఆయన కుమార్తె స్వప్న దత్ చేతుల మీదుగా ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో నటి లయ అమ్మవారి రూపంలో ఎంతో పవర్‌ఫుల్‌గా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.లయ, అనురూప్ కటారి, ఆకాంక్ష త్యాగరాజన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి దుర్గ ఫణిధర్ దర్శకత్వం వహిస్తున్నారు. రాగ మూవీస్, తిలోత్తమ ప్రొడక్షన్స్ బ్యానర్లపై వాణి శంకర్, తిలోత్తమ సంయుక్తంగా ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాకర్ల గోవర్ధనరావు ఈ చిత్రానికి కథను అందించారు.ఈ సినిమా నిధి అన్వేషణ అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో రూపొందుతోంది. పోస్టర్‌ను విడుదల చేసిన అశ్వనీదత్, స్వప్న దత్ చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా అమ్మవారిగా లయ కనిపించే సన్నివేశాలు ప్రేక్షకులకు రోమాలు నిక్కబొడుచుకునేలా ఉంటాయని, విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.ఈ చిత్రానికి శశిధర్ లంక సంగీతం అందిస్తుండగా, శామ్ కే ప్రసన్ నేపథ్య సంగీతం సమకూరుస్తున్నారు. ప్రసాద్ కేవీ సినిమాటోగ్రఫీ, రాఘవేందర్ రెడ్డి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాజేష్ లంక యాక్షన్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడిస్తామని నిర్మాతలు తెలిపారు.ం

నవ్వులు పూయిస్తున్న మౌళి 'డిఎన్‌కె' టీజర్



యువ నటుడు మౌళి ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'డిఎన్‌కె' (దొంగ నా కొడుకు). ఈ సినిమాలో సుష్మితా శెట్టి కథానాయిక. శ్రీను కంబాల దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఇందులో బిటెక్ డిస్కంటిన్యూ చేసిన ఈశ్వర్ అనే కుర్రాడిగా మౌళి కనిపించబోతున్నారు. అతడి తండ్రిగా ప్రముఖ హాస్య నటుడు అలీ నటిస్తున్నారు. తాజాగా రిలీజ్ అయిన టీజర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తోంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613